
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



మమత నిండిన పిలుపు
సమతనెరిగిన తలపు
మమత సమతల రమ్యతెరిగిన
మహనీయుడే - **గురువు**

భగవంతుని గుణావతరణం... ప్రతిరూపం... చైతన్య శక్తి స్వరూపం... ప్రేమమయ స్వరూపం... ధర్మ స్వరూపం... సత్యస్వరూపం... సద్గుణరూపం... జ్ఞానమత్వరూపం...జగదోద్ధారక స్వరూపం... **గురువు.** చేయి చూసేవారు కాదు - చేసి చూపేవారు... **గురువు.** ఆచరణతో బోధించువారు... నేర్చుకునేటట్లు చేసేవారు, మాటల వేదాంతి కాదు... చేతల వేదాంతి, రెండు పాదాలపై నడిచి వచ్చే ప్రేమ సుధాజలధికి ప్రతీక... **గురువు.** మనిషిని దైవంగా మలచుటకై మానవ రూపంలో వచ్చిన భగవంతుడు, రాయిని శిలగా - శిలను శిల్పంగా మలిచేవారు... **గురువు.** నయనానంద కారకుడు... జగదోద్ధారకుడు... శరణాగత వత్సలుడు...**గురువు.** శాంత, సౌమ్య సౌజన్యపూరిత జీవనుడు... **గురువు.**
భగవానుని మనోజ్ఞ రూపం, నిగ్రహానుగ్రహములందు సమర్థుడు.... **గురువు.**
అకారణ కరుణావరుణాలయుడు... అవ్యాజ ప్రేమమూర్తి... అనంతకరుణాసాగరుడు...
అనుగ్రహపూర్ణులు... పరమదయాళువు... **గురువు.**
ఓ ఆదర్శం.. ఓ ఆనవాలు... ఓ నిరూపణ... ఓ మార్గదర్శి... ఓ గురుతు... **గురువు.**
ఆలంబన... ఆదరణ... కేంద్రం... సత్తు... సత్వం... సత్యం... **గురువు.**

**దేహమనే దేవాలయంలో దైవత్వాన్ని, దివ్యత్వాన్ని దర్శింపచేసేవారు... గురువు.**

గురుపౌర్ణమి సంచిక


# గురుకృప

# గురుకృప

సంపుటి : 16
జూలై 22

సంచిక : 3
2013


## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

### లోపలి పేజీలలో


పారాయణ, మానస పూజ 3
- శ్రీబాబూజీ సత్సంగసుధ

ప్రకృతి నుంచి పాఠాలు 9
- శరశ్చంద్రికలు

ఊదీ 17
- శరశ్చంద్రికలు

సద్గురువు ఒక సజీవ దర్పణం 22
- శరశ్చంద్రికలు

శాస్త్ర గోష్ఠి 28
- గురుకృప

తమసోమా జ్యోతిర్గమయా 30
- పార్థసారథి ప్రవచనాలు







నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# పారాయణ, మానస పూజ



నిన్న సత్సంగంలో గురుపూర్ణిమ యొక్క ప్రాశస్త్యం, గురుపూర్ణిమ రోజున బాబా గురుపూజ చేసుకోమన్నారు గనుక, ఆ గురుపూజ వెనకుండేటువంటి మూలసూత్రాన్ని మాత్రమే తెలుసుకున్నాం, కానీ, ఆ సూత్రం ఆచరణలోనికి రావడం అంటే, కొద్దిగా క్లిష్టమైనటువంటి విషయం. అంటే ఏమిటి? సద్గురువుకు పూర్తిగా పగ్గాలప్పగించటం అనేటువంటిది సాయి యొక్క యోగంలో మూలసూత్రం అని అనుకున్నాం, మరి ఈ పగ్గాలప్పగించేటటువంటి విధానం ఎట్లా? నిత్యజీవితంలో మనమేమి చేసుకోవాల? సాయిభక్తులుగా ఉండే వాళ్లు చేసుకోవలసినవి ఏమిటి? అని ఎక్కువమంది ప్రశ్న వేస్తూ ఉంటారు.

సాయియొక్క జీవితం, సాయి యొక్క బోధలు ఈ రెండింటిని కూడాను మనం జాగ్రత్తగా గమనించుకున్నట్లయితే, బాబా చెప్పనటువంటిది లేదు. ఎట్లా అనేటువంటిది మనం చూస్తాం! మొట్టమొదటిది నిన్న అనుకున్న వాటిల్లో ఒకటి ఏమనుకున్నామనంటే సాయి భక్తులవటం అనేటువంటిది మనయొక్క ఎంపిక కాదు, బాబా, "తన భక్తులను తానే ఎన్నుకుంటాను" అని చెప్పారు. మనం ఏమనుకుంటాం? ఎప్పుడో బాబా ఫొటో చూసి, ఎవరో బాబా గురించి మనకు చెప్పి, ఏదో ఒక కష్టం వచ్చినందువల్ల ఆ కష్టంలో రకరకాల దేవుళ్ళకు మొక్కుకుంటూ, ముక్కోటి దేవతల్లో ఒకరిగా ఈయన కూడా, ఏదో మహిమగల దేవుడనుకొని ఈయనకూ ఒక మొక్కు మొక్కుకొని, ఆ మొక్కు మనకు తీరి, దాంతో ఆయన మీద గురి కుదిరి మళ్ళా రెండు మూడుసార్లు అట్లాగే మనమేదో కోరుకోవటంతో ఆ కోరిక తీరి, మనకు ఆయన మీద ఇంకా ఇంకా భక్తి పెరిగి దాని ద్వారా మనం సాయి భక్తులయినామని మనం అనుకుంటూ ఉంటాం.

కాని, బాబా మాత్రం దానిని ఒప్పుకోరు. బాబా ఏమంటున్నారు? "నా భక్తుడిని నేనే ఎన్నుకుంటాను. నా సంకల్పం లేకుండా ఎవరూ కూడాను శిరిడీకి రారు, నా భక్తులు కాలేరు" అని చెప్తున్నాడాయన. ఎందుకు? ఆయన భక్తులనేటటువంటిది ఎందుకు ఎన్నుకొంటాడు? ఒకర్నే ఎందుకు ఎన్నుకోవాల? అందరిని ఎందుకు ఎన్నుకోడు? అని ఒక ప్రశ్న మామూలుగా వస్తుంది. దీని వెనుకుండేటువంటి మూల సూత్రం ఏమిటి అని ఆలోచిస్తే, ఆయనే చెప్పాడు దానికి. మొట్టమొదట ఆయన చెప్పిందేమిటి అనంటే, "నాకు వాళ్లకి ఉండేటువంటి ఋణానుబంధం" అన్నారు మొదట. మనకు, బాబాకు ఉండేటువంటి ఋణానుబంధం వల్ల మనం బాబా భక్తులమవుతాం, ఆ ఋణానుబంధం నుంచి విముక్తులు కావడానికి ఆయన మనలను విముక్తులను చేస్తాడు ఈ సంసార బంధములోనుంచి. ఇది దీని వెనకుండేటువంటి సూత్రం. దాన్ని ఆయన ఇంకా ఎట్లా చెప్పాడు? "నాకు అల్లా కొంతమంది జీవులను అప్పచెప్పాడు, కొంతమందిని, వాళ్లను గురించినటువంటి విషయం అంతాకూడాను నేను అల్లాకి మళ్లా లెక్క చెప్పుకోవాలి" అన్నాడు. తెలివైన సాయిభక్తుడు ఏం చేస్తాడంటే, ఇంకా ఇంకా ఋణానుబంధాన్ని పెంచుకునే దానికోసంగా ప్రయత్నం చేస్తాడు. ఆయన ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఈ ఋణానుబంధాన్ని వదిలించేసుకోవాలని ఆయన చూస్తుంటే, మనమేం చేయాలి? ఇంకా ఇంకా ఋణాన్ని ముడిపెట్టుకోవాలి. ముడిపెట్టుకుంటే చాలు. ఇక మనబాధ్యత ఆయనదే అవుతుంది. మరి ఈ ఋణానుబంధాన్ని తిరిగి తిరిగి ముడిపెట్టుకోవడం ఎట్లా?

దీనికి మనం ప్రధానంగా చేయవలసినటువంటివి, గుర్తుంచుకోవలసినవి మూడు ఉన్నాయి.

ఒకటి ఆయన చరిత్ర పారాయణ.

రెండు మానసపూజ.

వీటిల్లో ఏది ఎట్లా ఆయనతో ఋణానుబంధాన్ని పెంచుతుందో ఒక్కసారి చూద్దాం. మనం మామూలుగా పారాయణ చేస్తూ ఉంటాం. పారాయణ ఎట్లా చేయాలండీ? అనేది చాలామంది ప్రశ్న. పారాయణను ఒక తంతుగా భావించుకొని దానిని ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా మనం పూర్తి చేసుకోవాల అనేటువంటి ప్రయత్నం



మనం చేస్తాం గనుక, అది మన బుర్రకెక్కదు. పరాయణత్వంతో చేసేటువంటిది పారాయణ. ఆ పదానికి అర్థం ఏమిటనంటే, తన్మయమవ్వాలి, లీనమవ్వాలి. నవల చదివేటప్పుడు వాడు తన ఉనికిని మరచిపోతున్నాడు. ఆ కథలో లీనమవుతున్నాడు. ఆ పాత్రలతో కలిసి జీవిస్తున్నాడు. ఆ తన్మయత్వం ఎక్కడైతే ఉన్నదో అది పారాయణ అవుతుంది. అటువంటి తన్మయత్వంతోనే మనం చదవాలి పారాయణ. బాబా చరిత్ర. మరి అంత తన్మయత్వం ఎట్లా వస్తుంది మనకు? నవలంటే ఆసక్తికరంగా ఉన్నది. మరి బాబా చరిత్ర ఆసక్తికరంగా ఉండదే అంతగా అనంటే, అదొక పారాయణ కింద, అది ఒక చరిత్ర తంతుకింద మనము పెట్టుకున్నాము గనుక ఆసక్తిగా వుండదుగాని, ఒక్కరవ్వ ఆలోచిస్తే కొద్దిగా, అంతకంటే ఆసక్తికరమైనటువంటి విషయం ఇంకోటి ఉండదు. ఎట్లాగ?

మొత్తం చరిత్రంతా ఏమిటి? ఆయన భక్తుల్ని ఆయన ఎట్లా ఎట్లా రక్షించాడు? ఎవరైతే ఆయన్ను ఆశ్రయించాలో, ఆయనకు దండం పెట్టారో వాళ్ళ యొక్క కష్టాలు ఆయన తీరుస్తున్నాడు. ఎందుకు తీరుస్తూ ఉన్నాడు? ఎవరన్నా ఆలోచించారా చరిత్ర పారాయణ చేసేటప్పుడు? మన నమస్కారాల కోసరంగా ఆయనేమన్నా దేబిరించుకు పోతున్నాడా? వెంపర్లాడుతున్నాడా? లేదా మనం పెట్టే నైవేద్యాల కోసం ఏమన్నా తపించిపోతున్నాడా? ఏమిటి కారణం? ఎందుకు మనం చెయ్యెత్తి బాబా అని నమస్కారం చేస్తే, ఆయన ఎందుకు రక్షిస్తున్నాడు?

మరి "మీరడిగినవన్నీ నేనిస్తూనే ఉంటా" అని ఎందుకు చెప్పాడు? "నేను నీ బానిసను" అని ఎందుకన్నాడు? "నిన్ను రక్షించడానికి నా తలనైనా ఇస్తా" అని ఎందుకన్నాడు? మరి మన నమస్కారాల కోసం మాత్రమే సంప్రీతుడయ్యేటువంటి వాడైతే ఆయన సద్గురువు ఎట్లా అవుతాడు? భగవత్స్వరూపుడు ఎట్లా అవుతాడు? కాబట్టి అది కాదు. మరి ఇంకేమిటి? ఒక ప్రశ్న వేసుకోండి! ఈ ప్రశ్నకి సమాధానాన్ని ఆయన చరిత్రలో వెతుక్కోండి.

సరే ఇవన్నీ జరిగినవి బాగానే ఉన్నది! ఈ లీలలంతా, ఈ అనుభవాలంతా కూడాను ఎవరెవరికో భక్తులకొచ్చినటువంటి అనుభవాలు ఇవంతా కూడాను. అవి చదువుకోవటం వల్ల నాకేమి ఒరుగుతుంది? ఇది నా అనుభవం కాదు కదా! కాబట్టి మనం కొద్దిగా తెలివిగా చేసినట్టయితే ఏమి చేయాలి? ఒక్కరవ్వ ఇమాజినేషన్‌ను ఊహను ఊహించగలిగితే కల్పనా శక్తిని, ఆ యొక్క భక్తుని స్థానంలోనే గాని మనమున్నట్లయితే, అదే లీలగాని జరిగితే, ఆ భక్తునిలో ఎటువంటి మార్పు వచ్చిందో, అటువంటి మార్పు మనలో కూడా వస్తుందా? ఎటువంటి మార్పు వస్తుందో చూద్దాం. ఒకవేళ వస్తే ఏదన్నా మార్పు. అని, ఆ భక్తుని స్థానంలో మనముండి ఆ లీలననుభవిస్తాం. అప్పుడు ఆ లీల జరిగినప్పుడు ఆ భక్తునికి ఎటువంటి ఫలితమైతే వచ్చిందో అటువంటి ఫలితంలో కొంతభాగమైనా మనకొస్తుంది. ఇది రెండోది.

ఇటువంటి పద్ధతులన్నీ పెట్టుకొని మనం చరిత్ర మొదలుపెట్టాము అనంటే, అది ఎంత ఆసక్తిగా ఉంటుంది? ఇది చదివేటప్పుడు, నవల చదివేటప్పుడు కూర్చొని టైం పెట్టుకొని కూర్చొని, మనం వ్యాస పీఠం వేసుకొని కూర్చొని చదువుతామా? పండుకొని చదువుతాం. వీపు నొప్పి పుడితే, రైల్లే పోతూ చదువుతాం. అన్నానికి టైం అవుతుంటే, అబ్బా! ఉండు కాసేపు, గంటాగి వస్తా, మంచి థ్రిల్లింగ్‌లో ఉంది అని అంటాం. ఎంతైనా సరే అది వదలాలనే బుద్ధి పుట్టదు. ఎందుకని? లోపల ఆసక్తి ఉన్నది గనుక. దానికి నియమం లేదు. ఎట్లా కూర్చోవాలి? ఏ రకంగా మనం ఉండాలి. స్నానం చెయ్యాలా? స్నానం చెయ్యకూడదా? భోంచేయాలా? భోంచేయకూడదా? ఇటువంటి నియమాలు ఏమీ ఎట్లాగైతే నవలకు లేవో, మన నవలా పారాయణకు లేవో ఇంకా కరెక్టుగా చెప్పాలంటే, అట్లాగే సాయి చరిత్ర పారాయణకు కూడా నియమాలు లేవు. ఉండే నియమాలు అంతా ఏమిటి అనంటే? ఇవే. ఆ జిజ్ఞాస, ఆ జిజ్ఞాసను వృద్ధి చేసేటువంటి సూత్రాలు. వీటిల్లో ఆ ప్రశ్నలకి మనం వేసుకున్న ప్రశ్నలకి సమాధానాలను వెతుక్కుందాం జిజ్ఞాసతో.



ఏమిటి ఏమిటి ఏమిటి? ఇట్లా చదివినట్లయితే ఒక్కసారి చదివితే చాలు. వాడు మర్చిపోలేడు! సమాధానాలు దొరకలేదు. దొరకల. కాబట్టి ఇంకోసారి చదువుతాం. అది రెండోసారి పారాయణ అవుతుంది. రెండుసార్లు చెయ్యటం కాదది. ఒకే సమాధానం కోసం దొరికిందాకా, దొరికిందాకా చదవటం. సమాధానాలు దొరికాయంటే మనస్సు సమాధానపడుతుంది. ఇదీ పారాయణ ఎట్లా చెయ్యాలి అనేదానికి.

దీంట్లో బాబాతో ఋణానుబంధాన్ని పెంచుకోవడం ఎట్లా అనేదానికి ఎట్టా ముడిపడింది? కాబట్టి బాబాతో మనకు సాన్నిహిత్యం ఏర్పడాలంటే భౌతికంగా ఆయన లేడు కనుక, ఆయన చరిత్ర రూపంలోనే మనకు ఆయనతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. పొయ్యేకొద్దీ, చదివే కొద్దీ చదివేకొద్దీ ఆయన చర్యలతో ఆయనతో సన్నిహితంగా ఉంటేటు వంటి భక్తుల రూపంలో ఆ స్థానంలో మనముండి ఊహించుకోవడం ద్వారా ఏమవుతుంది? ఆ భక్తులకు ఆయనకు ఉండేటువంటి సాన్నిహిత్యం, అంతకుమించినటువంటి సాన్నిహిత్యం కూడా మనకు దొరుకుతూ పోతుంది మనస్సులో. మనం ఆయన్ని ఆయనగా ప్రేమించడం మనకు చేతనవుతుంది. ఇంకా, ఇంకా, ఇంకా పారాయణ చేసుకుంటూ పోగా పోగా పోగా, బాబా ఏమన్నారు? “నా సంకల్పం లేకుండా ఆకైనా కదలదు” అన్నారు. ఆయన యొక్క చర్యలు, ఆయన చరిత్రంటే ఏమిటి? ఆయన యొక్క చర్య. మామూలుగా మనమేమనుకుంటాం? ఆయన ఎప్పుడు లేసారు? ధుని ముందు ఎట్లా కూర్చునేవారు? అప్పుడు ఏ మంత్రం చదివేవారు, భిక్షకు ఎట్లా పోయేవారు? పోతే ఏ ఇంటిముందు ఎట్లా పిలిచేవారు? ఏయే భక్తులతో ఎట్లా మాట్లాడారు? ఇవే మనం చరిత్ర అనుకుంటాం? కాని, ఆయన ఏమంటున్నారు? ఇదే కాదు నా చర్య, సకల సృష్టిలో ఏ కదలికైనా సరే నా చర్యేనూ అని అంటున్నాడు.

మనం చేసుటువంటి ఈ పారాయణ ఎక్కడికి దారి తీస్తుందనంటే, ఆయన యొక్క నిజమైన చర్యను చూడటం స్టార్ట్ అవుతుంది. అట్లా దారిలో పోతుంటే ఆకు కదిలితే బాబా యొక్క చర్య, కనురెప్ప పడితే బాబా యొక్క చర్యే. ఇక బాబా చరిత్ర కానిదేమిటి? ఆయన చరిత్ర పారాయణ కానిదేమిటి? ఈ పారాయణ మనలను ఆ పారాయణకు తీసుకుపోవాలి. ఈ పారాయణ యొక్క గమ్యం, లక్ష్యం ఏంటయ్యా అనంటే (మనలను) ఆ పారాయణ దగ్గరకు తీసుకుపోవటం. సృష్టిలోని ప్రతి కదలిక సాయి స్వరూపంగా, సాయి యొక్క చర్యగా మనకు గోచరించాలి. అది ఇప్పుడు వీలుపడకపోవచ్చు. ఎప్పటికైనా వీలుపడి తీరాలి. అట్లా చేసేటువంటిదే నిజమైన పారాయణ. కాబట్టి పారాయణ ఒక్కటి గట్టిగా జాగ్రత్తగా చేసినా మనం ఆ స్థితికి పోగలం. సరిగ్గా చేస్తే, దాని ద్వారా ఆయనతో ఋణానుబంధమూ పెంచుకోగలం. మనం పోలేకపోయినా ఋణానుబంధం పెంచుకుంటున్నాము గనుక ఆయనే తీసుకెళ్తాడు.

ఇక రెండవది – మానసపూజ. మామూలుగా మానసపూజంటే మనమేమనుకుంటాం? మామూలుగా పూజా విధానం పుస్తకాల్లో ఉంటాయి. షోడశోపచార పూజ అని. ఆవాహయామి, అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి, ధ్యానం సమర్పయామి అది సమర్పయామి ఇది సమర్పయామి అని చెప్పి ఏదో మనం అక్షింతలో, లేకపోతే పూలో ఏదో (మన చేతిలో) పెట్టుకొని ఆయన ఫొటో ముందు కూర్చొని అలా షూట్ చేస్తూ ఉంటాం వాటిని. ఇది మన దృష్టిలో శోడశోపచార పూజ అంటే. కాని ఇది కాదు మనవాళ్లు పెట్టినటువంటిది. పూలు పట్టుకొని నైవేద్యం సమర్పయామి అంటే, మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం, ఆయన్ను మోసం చేస్తున్నాం, ఎవరిని మోసం చేస్తున్నాం? కాబట్టి దీని యొక్క అర్థం ఏమిటి? ఎందుకు పెట్టారిది? అంటే ఇందాక పారాయణకు రెండు రకాల స్థాయిలు ఎట్లాగైతే ఉన్నాయో, షోడశోపచార పూజకు కూడా రెండు రకాల స్థాయిలున్నాయి. దీన్ని ఇట్లా చెయ్యమని చెప్పలా వాళ్లు. మానసికంగా చెయ్యమన్నారు.



దాంట్లో ఆ ఆర్డరులో ఉండేటువంటి రహస్యం ఏంటి అనంటే, బాబా మనింటికొచ్చారని అనుకుందాం. ఊహిద్దాం. బాబా ఒకరోజున మన ఇంటికొచ్చారు. రేయ్! నేను రేప్పొద్దున్న మీ ఇంటికి వస్తున్నానురా అని చెప్పి, ఉదయం 9 గంటలకు వస్తాను అని చెప్పి ఆయన వచ్చారు. మనం ఎట్లా స్పందిస్తాం అక్కడ. ఎదురు చూస్తూ ఉంటాం గేటు దగ్గర. ఆయన రాగానే రండి బాబా, రా...రా...రా...రా... రండి.. రండి అని తీసుకుపోతాం లోపలికి. ఆ పిలవడాన్నే ఆవాహయామి అంటాం.

రాగానే మొట్టమొదట పెద్దవాళ్లు మహాత్ములు ఎవరైనా వచ్చినప్పుడు ఏం చేస్తామంటే, పాదాలు కడుగుతాం. వాళ్ల పాదాలకుండేటువంటి మట్టంతా తీసేసి, ఆ యొక్క అపవిత్రమునంతా తీసేసి లోపలికొచ్చి పవిత్రం చేయమని కాదు. వాళ్ల పాదధూళిని మొత్తం కడిగేసి నెత్తిమీద చల్లుకొని, తాగడానికి. అందుకు పాదాలు కడిగేది మొత్తం. పాద్యం సమర్పయామి. తర్వాత అర్ఘ్యం సమర్పయామి.

లోపలకు రాగానే మామూలుగా మనం 40యో, 60 వోల్టుల బల్బు వేసుకొని వుంటే, ఎవరైనా పెద్ద వాళ్లు వచ్చినప్పుడు ఏం చేస్తాం? ఇంట్లో వుండే నాలుగు రకాలైన దీపాలన్నీ వేస్తాం. అదీగాక బాబాకు దీపాలంటే చాలా ఇష్టం. ఆయన భోజనం కోసం ఎలాగైతే ఆయన భిక్ష చేసారో, మళ్ళా దీపాలు వెలిగించడం కోసం అలాగే భిక్ష చేసారు. శిరిడీలో ఆయన చేసినటువంటి మొట్టమొదటి లీల కూడా ఏంటయ్యా అనంటే, దీపాలు వెలిగించడం. ఎప్పుడు మసీదు నిండా దీపాలు పెడుతుండేవారు. చీకటిలో ఉండటం ఆయనకు ఇష్టంలేదు. చీకటి అనే అజ్ఞానంలో ఆయనుండటం ఇష్టంలా, మనల్ని ఉంచడం ఇష్టంలా. ఆయనకు ఎప్పుడూ వెలుగుండాలి. ఎన్ని దీపాలు పెడితే అన్ని దీపాలు వుండాలి. కాబట్టి బాబా వస్తున్నారని తెలియగానే ఏం చేస్తాం, మన ఇంట్లో 60 వోల్టులు ఉన్నా కూడా నానా రకాల దీపాలు పెట్టుకుంటాం ఇంట్లో. బాబా రాగానే దీపాలన్నీ వెలిగిస్తాం. **దీపం దర్శయామి.**

ఆసనం సమర్పయామి - రండి బాబా కూర్చోండి అని చెప్పి మన ఇంట్లో ఉండేటువంటి సోఫానో, కుర్చీనో ఏదో ఒకటి మనమేస్తాం. ఆ తర్వాత ఏం చేస్తాం కూర్చోమనగానే కాఫీ కోసం బుదుంగున లోపలికి వెళ్లం. ఎవరన్నా పెద్దవాళ్లు వస్తే మొట్టమొదట కాసేపు ఒక పది నిమిషాలు కూర్చుంటాం వాళ్ల దగ్గర. వారి సన్నిధిలో కూర్చొని, ఆ తర్వాత ఇప్పుడే వస్తా అని చెప్పేసి లోపలికి పోతాం. అట్లాగే ఆ కూర్చోటం ఆయన సన్నిధిలో అట్లా కూర్చోవటం ధ్యానం. ఆ తర్వాత వాళ్లు చెప్పేటువంటి ఆర్డరులో ఏమున్నది? ధ్యానం సమర్పయామి.

ఆ తర్వాత మధుపర్కం సమర్పయామి - ఇప్పుడైతే మనం కాఫీలు,టీలు ఇస్తున్నాం. ఆ రోజుల్లోనైతే ఏదైనా తీయని పానీయం ఇచ్చేవాళ్లు. మధుపర్కం అనంటే తీయని పానీయం అని అర్థం. అది ఇచ్చిన తర్వాత కాసేపు మరలా ఆయన దగ్గర ఆయన సన్నిధిలో కూర్చొని, బాబా స్నానం చేయడానికి వస్తారా? స్నానం మనమే చేయిస్తాం. ఆ తరువాత... ఒక కఫ్నీ ఇస్తాం. కొత్తది. ఇది ఒక పద్ధతి. ఇది ఆంతర్యంలో ఒక అరగంటలో అయిపోయేటటువంటి షోడశోపచారపూజ.

కాని బాబా చెప్పినదేమిటి? జీవితంలో సాధన ఒక భాగం కావడం కాదు. జీవితమే సాధనలో భాగం కావాలి. అంటే ఏమిటి? అంతా వదిలిపెట్టేసి వచ్చి బాబా ధ్యానంలో ఉండాలా అండి! అని అడగొచ్చు. అది సాయి పద్ధతి కాదు. అది బాబా పద్ధతి కాదు. మనము ఏమి చేస్తున్నా అది బాబా పూజ కావాలి. ఆయన షోడశోపచార పూజ కావాలి. మరి ఎట్లా ఇది చేయటం? ఇది ఒక స్థాయిలో జరిగేటువంటి షోడశోపచార పూజ నేను చెప్పినటువంటిది. ఇదీ చెయ్యాలి అదీ చెయ్యాలి.

ఇక రెండోస్థాయి ఏంటో ఆలోచిద్దాం. బాబా ఏం చెప్పారు? "అన్ని జీవులలోనూ తానే ఉన్నాను" అని అన్నాడు. "అన్ని రకాల జీవుల్లో ఆయా రూపాల్లో నేను తిరుగుతూ ఉంటా" అని చెప్పాడు. మనం ఉదయం లేచి, మనం



చూసేటువంటి జీవులందరి రూపంలోనూ బాబా ఉన్నారు అని చెప్పి మానసికంగా ఆవాహన చేస్తాం. రోడ్డుమీద పోతున్నాము, రకరకాల మంది వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు జనమంతా కూడాను. అబ్బ! ఇన్ని రూపాలలో కూడా ఉండేది బాబా కదా, అని ప్రతి ఒక్కరిని చూసినప్పుడంతా దానిలో ఉండేటువంటి బాబాను మనం ఆవాహన చేస్తాం. "బాబా" అని అనుకుంటాం లోపల. ఎంతమందిని చూసినా సరే, ఏ జీవిని చూసినా సరే "బాబా" అనుకుంటాం. మనిషిని చూడగానే, మొట్టమొదట చూడగానే ఒక్కసారి ఆ జీవిలో ఉండేటువంటి, ఆ రూపంలో బాబానే ఉన్నారు అనే విషయం గుర్తుపెట్టుకుంటాం. అది నిజమైన ఆవాహన. సాయిని సకల జీవుల్లోనూ ఆవాహన చేయడం! ఇది అయిపోయింది. ధ్యానం. దీనినే మనం జాగ్రత్తగా గుర్తుపెట్టుకుని నిన్న మనం అనుకున్నట్టుగా అంతా చేయించేటువంటది ఆయనేను అని ఆయనకు పగ్గాలప్పచెప్పటం అనేటువంటిది నిజమైన ధ్యానం అవుతుంది. ఎప్పుడైతే ఇన్ని రూపాల్లోనూ ఉండేటువంటి బాబాను మనం గుర్తించామో, ఇన్ని రూపాలతో మనం వ్యవహారం చేస్తున్నప్పటికీ కూడాను మనం సాయి సన్నిధిలో ఉన్నట్లే అవుతుంది.

తర్వాత నడుస్తూ ఉన్నాం.బాబా ఎక్కడ లేరు? సర్వత్రా నేనే వున్నాను అని అన్నాడు. కాబట్టి నడిచేటువంటి ప్రతి నడకా కూడాను, మనం వేసే ప్రతి అడుగు కూడాను బాబాకు ప్రదక్షిణం అవుతుంది – అనే భావనలో నడవండి. మన నడక నడక కాకుండా పోతుంది, అది ప్రదక్షిణ అవుతుంది.

స్నానం చేస్తూ ఉన్నాం, సర్వజీవుల్లోనూ ఆయనే ఉన్నాడు. మనలో కూడా ఆయనే ఉన్నాడు – చైతన్యం రూపంలో. కాబట్టి మనం చెంబుతో నీళ్ళు పోసుకున్నప్పుడు ఎవరికి అభిషేకం అది? లోపలుండేటువంటి బాబాకు అభిషేకం అనే భావనతో చెంబుతో నీళ్ళు పోసుకోవడం మన శరీరం మీద. మనం స్నానం చేసినా సరే అది బాబాకు అభిషేకం అవుతుంది.

నైవేద్యం – ఇది బాబా ప్రధానంగా గుర్తుపెట్టుకోమని చెప్పినటువంటి ఒక విషయం. ఆయనేమన్నారు అంటే, "ఎవరైతే నాకు పెట్టుకుండా ఏమీ తినరో వాళ్లకు నేను బానిసను. వాళ్లను రక్షించటానికి నా తలనైనా ఇస్తా" అని అన్నాడు. దాన్ని మాత్రం ఆయన చాలా ఎక్కువ ఇదిగా స్ట్రెస్ చేసి మరీ చెప్పేవారు. ఆ నైవేద్యం అనేటువంటి దాన్ని గురించి. ఎందుకని? మన ఆలోచనలో మనకెక్కువ వీక్‌నెస్‌గా ఉండేటువంటి మనసుకు బలహీనతలు ఏంటి అనంటే తిండి గురించే. ఇది తింటే బాగుణ్ణు, అది తింటే బాగుణ్ణు అని. అందుకే వేమన అన్నారు "జిహ్వా రుచులచేత జీవుండు చెడునయా" అని.

మనం మామూలుగా చాలా తేలిక అనుకుంటాం జిహ్వాను జయించటం. కాని ఆలోచిస్తే మాత్రం అంత తేలిక కాదది. ఏమి తింటున్నా సరే మనం, మంచినీళ్లు తాగుతున్నా, ఏమి తింటున్నా సరే ఒక్కసారి ఇది బాబాకు నైవేద్యం పెడుతున్నాం – ఆయన యొక్క ప్రసాదం, ఇది ఆయన యొక్క ఉచ్ఛిష్టం, ఆయన యొక్క నైవేద్యం అని అనుకొని తినేసేయటం, మనం చేసే ప్రతి ఒక్కటి కూడాను ఆయన నైవేద్యం అవుతుంది. అన్ని జీవుల్లోనూ ఉండి తినేటువంటిది ఆయనే. మంచినీళ్లు తాగుతున్నా సరే, ఒక్కసారి మనసులో – దానికి ఒక పెద్ద ఫోజు ఇవ్వాల్సిన అవసరం లేదు. గ్లాసు చేతికి తీసుకుంటుండగానే మన మనస్సులో ఒక భావన వచ్చేస్తుంది. ఇది బాబా తీర్థం. ఇది బాబా యొక్క పాద తీర్థం అనుకుంటూ. గ్లాసు ఇక్కడి నుండి నోటికొచ్చేటప్పటికి ఈ భావన అయిపోతుంది. చూసేటువంటి వాడికి ఏమీ అర్థం కాదు. మనం అసలు నైవేద్యం పెట్టామన్న విషయం కూడా అర్థం కాకూడదు. మనసులో ఆ భావం. ఇది బాబా ప్రసాదం.,... అందరికీ అన్నీ ఇచ్చేవాడిని నేనే అని అన్నారు ఆయన. ఈ రోజున ఈ రూపంలో నాకు అన్నం పెట్టారాయన. ఇది ఆయన ప్రసాదం. ఆయన యొక్క ఉచ్ఛిష్టం. ఆయన తినగా మిగిలినటువంటి ఉచ్ఛిష్టం అనే భావంతో తినటం. భావం ఎక్కడైతే ఉందో అక్కడ ఫలితమూ ఉంటుంది.



ఇందాక మనం చెప్పుకున్నట్టుగా ఉదయమే లేచి షోడశోపచార పూజ చేసినట్లయితే రోజూ మన ఇంటికి బాబాను పిలిచి ఆయనకు సేవ చేసి ఆయనకు భిక్ష పెట్టినటువంటి పుణ్యం మనకొస్తుంది. ఆయనతో ఋణానుబంధం పెరుగుతుంది. రోజూ ఆయన మన ఇంటికి వచ్చి భిక్ష చేస్తుంటే మనకు ఎంత ఋణానుబంధం పెరుగుతుంది? బయజాబాయి ఇంటికి రోజూ ఆయన భిక్షకు వచ్చేవారు. ఆయన ఎట్లా చూసుకున్నాడు? ఆమెను గాని, తాత్యాకోతేను గాని? ఎప్పుడైనా రెండు రొట్టెలు పెట్టినటువంటిదానికి, ఆయన రోజూ 35 రూపాయలు ఇచ్చాడు, తర్వాత ఆ రోజుల్లో. లక్షాధికారులు కోటీశ్వరులైనారు. ఎందుకని? బాబాకు ఒక ప్రిన్సిపల్ ఉంది. నాకు ఎవరైనా సరే ఒక్కరూపాయి ఇస్తే నేను తిరిగి వాడికి పది రూపాయలు ఇవ్వాలి అని. ఆయన చేసిన ప్రతిజ్ఞ అది. ఇది మనం రోజూ భిక్ష గాని పెట్టినట్లైతే అంతకు పదింతలు మనకు దేనికీ లోటుండకుండా ఆయన జరుపుకుంటాడు. ఇది కాక మనం చేసేటువంటి ప్రతి ఒక్కటి కూడాను ఆయనకే, ఆయన యొక్క ప్రసాదంగా, ఆ సత్యాన్ని మనం గుర్తించి మనంగాని చేసుకుంటూ, ఆ భావన చేసినట్లయితే మనకు జీవితమంతా సాధనే అవుతుంది.

బాబా ప్రసాదం మనలోకి పోయినందువల్ల మనలో ఉండేటువంటి ఆలోచనలు అన్నీ కూడాను, మంచి ఆలోచనలు, బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి. ఎందుకని? మనకు ఆలోచన తెచ్చేటువంటిది ఏంటి అనంటే, ఆలోచన ఇచ్చేటువంటిది ఏంటి అనంటే ఆహారమే. ఆహారము సరిగ్గా ఉంటే ఆలోచనలు సరిగ్గా ఉంటాయి. కాబట్టి బాబా ప్రసాదం అని తింటున్నట్లయితే పవిత్రమైనటువంటి ఆలోచనలు మనలో రావడం మొదలవుతాయి. బాబాకు సంబంధించిన ఆలోచనలే వస్తాయి. మనలో ఉండేటువంటి బలహీనతలన్నీ కూడాను మాసిపోతాయి. ఇది ఒకటి.

ఇట్లా మనం చేసేటువంటి ప్రతి పని కూడాను బాబా యొక్క సేవ కిందనే మనం మలచుకోవడంలో వుంది. ఇప్పుడు నేను చెప్పినటువంటిది ఊరికనే ఉదాహరణ మాత్రమే. ఎవరివారి వ్యక్తిత్వానికనుగుణంగా దీన్ని ఎన్ని రకాలుగా అయితే అన్ని రకాలుగా మనం మలచుకోవచ్చు. అప్పుడు సాధనలోనే జీవితం భాగమవుతుంది. ఇక మనం దీన్ని గురించి ఆలోచించాల్సిన పనుండదు. మన గురించి ఆయన ఆలోచిస్తుంటాడు. మనకి కష్టం వచ్చే పశ్నేలేదు ఇక. ఈ రకంగా నేను చెప్పిన ప్రకారంగా ఎవరైతే చేస్తారో వాళ్లకు కష్టము, లోటు అనేటువంటిది ఉంది అనే ప్రశ్నే లేదు అసలు. అన్నీ ఇంక ఆయనే చూసుకుంటుంటాడు. ఆయనకు అన్నింటికంటే మనం అత్యంత ప్రీతిపాత్రులవుతాం. ఇట్లా మన యొక్క జీవితాన్ని సాధనలో భాగం చేయడానికి మనం అభ్యాసం చేయాలి.

ఏదో పొద్దున్న ఒక అయిదు నిమిషాలు, సాయంత్రం ఒక అయిదు నిమిషాలు ఆయన ఫోటోను చూసి నమస్కారం చేసుకొని, లేదు వేరే ఏదన్నా అర్జంటు పని వున్నట్టయితే, ముందు అది చూసేసుకొని తర్వాత బాబా దగ్గరకు వస్తాం. అన్నింటికన్నా తక్కువ ప్రాముఖ్యత ఇచ్చేది దేనికయ్యా అనంటే మనం దీనికే. మన పనులలో ఏవండీ ఈ రోజు కొద్దిగా బాబా పని చేసినట్టయితే, చాలా అర్జంట్ పని వచ్చిందండి అందుకే మేము వెళ్లిపోయాము. ఇంక ఏమీ పని లేకపోతే మన ముఖం చూసేదానికి ఎవరూ లేకపోతే అప్పుడు మనం లాస్టులో నీ మొహం చూస్తానని చెప్పినట్లు లెక్క. అట్లా ఉండకూడదు. మొట్టమొదట ఆయనకే ప్రాధాన్యత ఇవ్వాలి. దానికి అవకాశం లేదు, మనం, ఇందాక నేను చెప్పినట్లుగా చేసినట్లయితే అసలు ఆయన్ను చూడకుండగా పోయే ప్రశ్నే లేదు. కాని దానికి రోజూ ఒక నియమమనేటువంటి వేళల్లో మనం కూర్చొన్న బాబాను స్మరణ చేయడం, ఇందాక నేను చెప్పినట్టుగా షోడశోపచార పూజ చేయటమనేటువంటిది దీనికి దోహదం చేస్తుంది. ఎందుకని? ఈ రకమైన గుర్తింపు రావాలంటే మనసు మీద అదుపుండాలి. మన మనస్సు మనం చెప్పినమాట వినాలి. ఈ అదుపు లేకపోతే మనం ఊరికనే అనుకుంటూ ఉంటాం గాని, ఈ భావనలేమీ చెయ్యం.ఇవన్నీ దేనికి ఉపయోగపడ్తాయి అనంటే, ఏమయ్యా అయిదు నిమిషాలు కూర్చొని బాబా ధ్యానం చేసుకోకూడదా? నా జీవితంలో నేను బాబా ధ్యానం చేసుకోనిదెప్పుడు. నేను నడుస్తున్నా బాబా ప్రదక్షిణలే



అని చెప్పి... నేను చెప్పినదంతా దేనికి ఉపయోగపెట్టుకుంటామంటే – ఆ అయిదు నిమిషాలు కూచోకుండా పోవడానికి ఒక ఎత్తు కింద తయారవుతుంది లేకపోతే, మనకా సెన్సిటివిటీ లేకపోతే.

మనం ఒకటి గుర్తుపెట్టుకోవాలి. మనల్ని మనం మోసం చేసుకోవడం కాదు. మన ధ్యానంగాని, మన యొక్క ఆధ్యాత్మికత గాని, మన సాధనగాని, మనకు బాబాకు మాత్రమే తెలియాలి. ప్రపంచానికి తెలియాల్సిన అవసరం లేదు. మనం సాయిభక్తులుగా ఉండాలనే దానికంటే కూడాను సాయిభక్తులుగా గుర్తింపు పొందాలనేటువంటి ప్రయత్నం ఎక్కువవుతుంది! ఇంకచాలు. ఈ గుర్తింపు కోసం పడిపోతుంటాడంతే. సాయి భక్తుడని ప్రపంచమంతా ఒప్పుకుంటుంది! జగత్తంతా ఒప్పుకుంటుంది. ఒక్క బాబా మాత్రం ఒప్పుకోడు, సారీ, ఒప్పుకోవాల్సింది ఆయన. ప్రపంచమంతా ఒప్పుకోకపోయినా మనకు బాధలేదు. కాబట్టి ఆ విషయం జాగర్తపడాలి మొట్టమొదట. డంబాచారం పనికిరాదు. ఇట్లా చేసుకుంటూ పోయినట్లయితే మనకు మన జీవితమంతా కూడాను, మన లైఫ్ అంతా కూడా సాయి ధ్యానమే అవుతుంది. సాయి ఉపాసనే అవుతుంది. దీంట్లో కానిది ఏదీ ఉండదు.

మనం ఏమీ వదులుకోవలసిన అవసరం లేదు, వదులుకోమని బాబా ఏమీ చెప్పనూ లేదు. ఇంక దాంతో తృప్తి పడండి, అంతలోనే తృప్తి పడండి ఆయనేమి చెప్పలా, "నువ్వు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటా నేను" అన్నాడు.

*– శ్రీబాబూజీ సత్సంగసుధ*

## శరశ్చంద్రికలు

## ప్రకృతి నుంచి పాఠాలు – *ఏప్రిల్ 2013*



**భక్తుడు :** గురువుగారూ! మేము ఇక్కడకు ఎందుకు వచ్చాం?

**గురువుగారు :** అవును, మీరిక్కడకు ఎందుకు వచ్చారు? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం మీ వద్ద ఉండదు. ఎవరైనా మిమ్మల్ని ఉన్నట్టుండి అడిగితే మీరు సమాధానం చెప్పలేరు. "మాకు గురువుగారంటే ఇష్టం, అందుకని ఆయనతో ఉండాలనుకుంటున్నాం" అనేది మీ సమాధానం అని నాకు తెలుసు.కానీ దాన్ని అటుంచి, "మనం గురువుగారిని ఎందుకు ఇష్టపడుతున్నాం? మనం ఆయననెందుకు చూడాలనుకుంటున్నాం? మనం నిజంగా గురువుగారిని ప్రేమిస్తున్నట్లయితే, మనం ఇక్కడ ఏం చెయ్యాలని, ఎలా ఉండాలని ఆయన కోరుకుంటున్నారు?"... అని మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించుకుంటున్నారా? మీకు ఆ జిజ్ఞాస ఉండాలి. ఏదైనా విహార యాత్రలకు వెళ్లినపుడు ఆయా ప్రదేశాలకు సంబంధించిన పుస్తకాలలో (టూరిస్ట్ గైడ్‌లలో) మనకు కావలసిన సమాచారమంతా ఉంటుంది – ఈ ఘాట్ ఎక్కడుంది, ఆ ఘాట్ ఎక్కడుంది, టీ ఎక్కడ తాగాలి, అక్కడ ఏమైనా కొనుక్కోవాలంటే సరియైన ప్రదేశం ఏది? – ఇటువంటి విషయాలకు సంబంధించిన వివరాలన్నీ పుస్తకాలు చూసి తెలుసుకోవచ్చు. కానీ అందులో ఒక్క పేజీ మాత్రం కనిపించదు – మనకు దారి చూపే



గైడ్ (మార్గదర్శి) మనం ఏం చెయ్యాలని అనుకుంటున్నాడు అనేది మాత్రం అందులో కనిపించదు. ఎందుకంటే ఏ పుస్తకమూ మనకు ఈ విషయాన్ని చెప్పదు. మన వద్ద మనం స్వంతంగా తయారుచేసుకున్న గైడ్ ఉండాలి లేకపోతే తయారు చేసుకోవాలి, ఎందుకంటే గైడ్‌గా (మార్గదర్శిగా) ఒకరు ఉండి అతని నిర్దేశకత్వంలో జరిగేదే నిజమైన యాత్ర. అంటే ఆ గైడ్‌కి మన వ్యక్తిగతమైన అవసరాలు తెలిసి ఉండాలి, అప్పుడు మన మొత్తం ప్రయాణం మరొక రకంగా మారుతుంది. అప్పుడది విహారయాత్రగానో, పర్యటనలాగానో కాక ప్రతిదీ మరో క్రొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. అలా కాకపోతే, అది కేవలం – విహారయాత్రగానో, వినోదయాత్రగానో, వివిధ ప్రదేశాలను సందర్శించే యాత్రగానో మిగులుతుంది. ఇది వివిధ ప్రదేశాలను సందర్శింపచేసే యాత్ర కాదు, అంతర్దృష్టిని దర్శింపచేసే యాత్ర కావాలి (గురువుగారు నవ్వుతూ)

**భక్తుడు** : గురువుగారూ! ఈ ప్రయాణంలో మా సమయాన్ని సక్రమంగా ఉపయోగపెట్టుకోవడం ఎలా?

**గురువుగారు :** ఇక్కడ మనమంతా సంతోషంగా ఉన్నాం. మనకు వీలుపడినప్పుడల్లా బాబా నామం చేసుకోవచ్చు. ఆయన ధ్యాసలో ఉండవచ్చు. ఇంకా కుదిరితే, మనం నదిలో రివర్ రాఫ్టింగ్ చేయడానికి వెళ్తాము, అందమైన ప్రకృతిని చూసి ఆనందిస్తాం. ఇటువంటి వాటిని ఆస్వాదించడంలో తప్పేమీ లేదు, (అందరూ) సామరస్యంగా మెలుగుతూ, ఆనందాన్ని ఆస్వాదించడం ముఖ్యమైన విషయం. ఈ స్ఫూర్తికి భంగం కలిగించేది ఏదైనా అది సరికాదు. సాధారణంగా మన దైనందిన జీవితాలలో మనకు నచ్చిన వాటిని సొంతంగా నిర్ణయించుకొని దానికి అనుగుణంగా చేస్తుంటాము. వాస్తవానికి మన వ్యక్తిగత నిర్ణయాలు, ఎంపికలు మన వ్యక్తిత్వాన్ని (ప్రత్యేక అస్తిత్వాన్ని) బలోపేతం చేసి ఇష్టాయిష్టాలను ప్రబలం చేస్తాయి. ఒకవేళ మీరు మీ బలమైన వ్యక్తిత్వాన్ని, అన్యత్వభావనను, అహాన్ని (దానిని మీరు ఎలా పిలిచినా సరే) కోల్పోవడానికి గనుక ఈ ప్రయాణాన్ని ఉపయోగపెట్టుకోవాలని అనుకుంటే ఇది దానికి అనువైన మార్గం. మీరిక్కడ ఎక్కడికి వెళుతున్నాము అని ఆలోచించనక్కరలేదు. మీకు ఎలాగూ ఆలోచించవలసిన పని లేదు కాబట్టి మీరు సంతోషంగా అందరితో కలసి సాగిపోతారు. ఈ ప్రయాణం బ్రేక్‌డాన్స్, షేక్‌డాన్స్, గో–గో డాన్స్ లాంటి ఒక్కరే చేసే నృత్య ప్రదర్శన లాగా కాక సమిష్టిగా చేసే నృత్య ప్రదర్శనలో పాల్గొనడం లాంటిది. (నవ్వులు). ఇది గిరిజన నృత్యం వంటిది, దానిలో సహజ సౌందర్యం ఉంటుంది. అటువంటి నృత్యాన్ని చూస్తుంటేనే మనల్ని మనం మరచిపోతాం. అందులో అన్యత్వ భావన ఉండదు. వ్యక్తులకు ప్రాముఖ్యత ఉండదు. మొత్తంగా అందరూ ఒకటిగా కదలడం మొదలుపెడతారు. ఆదిమ తెగలలో, వారు ప్రకృతికి తాము భిన్నం, ప్రత్యేకము అనే భావనను పోగొట్టి ప్రకృతితోను, వారి పరిసరాలతోనూ, వారి సమూహంతోనూ మమేకం కావడానికి ఈ నృత్యరూపాలను కనుగొనడం జరిగింది.

జీవితంలో మీకు ఇటువంటి అవకాశాలు చాలా తక్కువగా వస్తాయి, కాబట్టి మీకు ఆ అవకాశం వచ్చినపుడు దానిని ఉపయోగపెట్టుకోవడానికి ప్రయత్నించండి. దానిని సరిగా ఉపయోగించుకుంటే మన

బలమైన అహాన్ని పోగొట్టుకోవడానికి, మన ప్రేమను పెంచుకోవడానికి, మనల్ని మనం కోల్పోయి అందరితో మమేకమయ్యే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి తోడ్పడుతుంది. ఇటువంటి ప్రయాణం "నేను" అనే అహంకారపు మంచుకొండను కరిగించే అగ్నిజ్వాల వంటిది.



**గురువుగారు :** అహంకారమనే టెర్రరిజం (తీవ్రవాదం) నుండి, దానివల్ల మీ మధ్యలో కలిగే విరోధాలు, కోపతాపాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ప్రయత్నించండి. కొన్ని విషయాలు మీకు నచ్చినట్లు జరుగకపోవడం సహజమే. కొన్నిసార్లు భోజనం ఏర్పాట్లు సరిగా ఉండకపోవచ్చు లేదా మీకు అసౌకర్యంగా ఉండవచ్చు, ఇబ్బంది కలుగవచ్చు. మనం అటువంటివాటికి సంసిద్ధులమై ఉండాలి – ఒక జట్టుగా ఉ ండడం యొక్క స్ఫూర్తి అదే. అదీ కలసికట్టుగా ఉండటం అంటే. ఎవరో ఒకరు మీ కాలు తొక్కుతారు, అది క్షమార్హం కానట్టు అతనికేసి ఒక చూపు చూస్తారు మీరు. పదిమందితో ఉన్నప్పుడు ఇటువంటివి చాలా విషయాలు జరుగుతుంటాయి. వీటివల్ల మీరు క్షమాగుణాన్ని నేర్చుకుంటారు. క్షమించడమన్నది ఎలానో నేర్చుకోవడం ద్వారా మీరు (కొన్ని) వదిలిపెట్టగలుగుతున్నారు, అందరితో సర్దుకుపోగలుగుతున్నారు. ఇదే నేను ఇంతకుముందు చెప్పిన జట్టుగా ఉండటం వలన వచ్చే స్ఫూర్తి (టీమ్ స్పిరిట్). కనీసం ఈ కాస్త రెండు వారాల ప్రయాణంలో మన వ్యక్తిగతమైన నిర్ణయాలను, ప్రాధాన్యతలను, ఇష్టాయిష్టాలను, సౌకర్యాలను వదిలిపెడదాం. మనకు కావలసిన సౌకర్యాల గురించి బాబా చూసుకుంటారు, అది ఎలాగూ జరుగుతుంది. మనం ఒక్కరమే ప్రయాణం చేసిన దానికన్నా ఇప్పుడు ఎక్కువ సౌకర్యవంతంగా ఉన్నాం, కానీ అది వేరేసంగతి (గురువుగారు నవ్వుతూ).. ఇప్పుడు వచ్చిన ఈ అవకాశాన్ని గుర్తించి, కృతజ్ఞతాభావంతో ఆత్మీయంగా ప్రతిస్పందించడం – ఇదీ పద్ధతి. ఇతరుల గురించి కూడా పట్టించుకుంటూ, మీ మాటల్లో చెప్పాలంటే, "నిన్ను నువ్వు ఎలా ప్రేమించుకుంటావో ప్రక్కన వ్యక్తిని కూడా అలాగే ప్రేమించడం" కోసం ప్రయత్నించడం.. ఇటువంటి విషయాలన్నింటినీ నేర్చుకోవచ్చు. ఇలాంటివి నేర్చుకోవడం కోసం నేను మీకందించిన సరైన సందర్భమిది!

కానీ, నేను చెప్పినట్టు, నేను దీనిని ఆధ్యాత్మిక యాత్ర అని, తీర్థయాత్ర అని, సాధన అని అనను. దీనిని ఆధ్యాత్మికం చేసుకుంటారో లేదో అది మీకు సంబంధించిన అంశం. ఒకవేళ మీరు, ఈ ప్రయాణం ఏ విధంగా ఆధ్యాత్మికం అవుతుందనిగాని ఒక పర్వతాన్ని ఎక్కి చుట్టుప్రక్కల చూడటం, నదిలో రాఫ్టింగ్ చెయ్యడం ఆధ్యాత్మికంగా మీకెలా సహాయం చేస్తాయనిగాని నన్ను అడిగితే – అది మీకు సంబంధించిన విషయం. ఇది తీర్థయాత్రో లేదా మరొకటో కాదు. దీనిని తీర్థయాత్ర చేసుకోవలసింది మీరే. ఇక్కడ మొత్తం కార్యక్రమం వెనుక గల ప్రధానమైన ఉద్దేశ్యం ఇదే. మీకు కావాలనుకుంటే అది అలా (సాధనలా) ఉపయోగపెట్టుకోండి – ఉపయోగపెట్టుకోమని నేను చెప్పడం లేదు. మీకు కావాలనిపిస్తే చెయ్యవచ్చు, అలా చెయ్యకపోయినా ఫర్వాలేదు.



కనీసం, మీరు ఇక్కడ ఉన్నప్పుడైనా, మీ సమస్యలు, బాధలు మర్చిపోయి సంతోషంగా ఆనందిస్తూ, సాగిపోయే ప్రవాహంతో ఒక్కటిగా ఉంటూ, ఎటువంటి ప్లానింగ్ లేకుండా, మనం ఏం చేయబోతున్నామో తెలియకుండా, రేపు ఎక్కడికి వెళుతున్నామో తెలియకుండా ఉండటం ఎంత బాగుంటుంది! జీవితంలో మీకు ఇటువంటి అవకాశాలు అరుదుగా వస్తాయి, ఎందుకంటే మీరు ఎప్పుడూ చాలా పక్కాగా ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కాబట్టి ఇటువంటి అవకాశాలు వచ్చినపుడు వాటిని ఉపయోగపెట్టుకుందాం. మన బలమైన అలవాట్ల సరళి నుండి బయటపడటానికి ప్రయత్నిద్దాం.

**గురువుగారు :** మన చుట్టూ వున్న ప్రతిదీ మనకు ఏదో ఒకటి నేర్పించాలి. నదిలో రాఫ్టింగ్ చేస్తున్నా, టీ కొట్టులో కూర్చున్నా, బస్సులో ప్రయాణిస్తున్నా – **సమస్తమూ మనకు ఏదో ఒకటి బోధించాలి. సకల సృష్టి మనకు బోధిస్తూ, నేర్పిస్తూ, తెలియచేస్తూ ఉండాలి. మీరు కేవలం సత్సంగంలోనే నేర్చుకోవడం కాదు, ప్రతి నిమిషం నేర్చుకుంటూనే ఉండాలి, మీరు ఎప్పుడూ నిరంతరం విద్యార్థిగా ఉండాలి. మీరు సత్సంగంలో నేర్చుకునేది చాలా కొంచెం మాత్రమే, సత్సంగం వెలుపల మీరు నేర్చుకునేదే చాలా ప్రధానం.** అయితే, మీకు ఉపయోగపడేలా ఈ రెండింటినీ మీరు సమన్వయం చేసుకోగలగాలి. సాంఖ్య, ఇంకా కొన్ని వేదాంత సంప్రదాయాలలో "విశ్వం ఇరవై నాలుగు తత్వాలలో, అంశాలతో రూపొందింది" అంటారు. అందుకనే దత్తాత్రేయులవారు తమకు "ఇరవై నాలుగుమంది గురువులు"[1] అని చెప్పారు. ప్రతిక్షణం, ప్రతి విషయం, సమస్త విశ్వం ఆయనకు గురుస్వరూపమయింది. చివరికి ఎవరో పిండి దంచుతున్నా అది ఆయనకు ఏదో బోధించింది, సమస్త ప్రపంచం ఆయనకు ఉపదేశించింది. ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. అది కేవలం అంతవరకే అని కాదు. **ప్రతి చర్యా, చివరికి ఆకు కదిలినా అది మనకు సద్గురు ప్రబోధం కావాలి. సమస్తమూ గురువే, సమస్తమూ సద్గురువే.** దత్తాత్రేయుల గురించి భగవాన్ మాట్లాడుతూ, "దత్తాత్రేయుల వారికి ఇరవై నాలుగు మంది గురువులు"[2] అని భగవాన్ అన్నప్పుడు ఆయన ఉద్దేశ్యం ఇదే. అంటే దత్తాత్రేయుల వారికి ఇరవై నాలుగు మంది అంటే దత్తాత్రేయులు సమస్త జగత్తును తమ గురువుగా చూసారు. సమస్త విశ్వం ఆయనను జగద్గురువుగా చూసింది. జగద్గురువు అంటే ఎవరు? ఎవరైతే జగత్తును తమ గురువుగా భావిస్తారో వారే జగద్గురువు. కాబట్టి ప్రతి విషయంలో, ప్రతి పనిలో నేర్చుకోవడానికి చాలా ఉంది, మనల్ని మన పథంతో అనుసంధానించి, ఆ శ్రద్ధను నిలుపుకునేలా చేసేటటువంటి విషయాలు చాలా ఉంటాయి. ప్రతి విషయం మనకు ఎంతో కొంత నేర్పాలి.

**భక్తుడు :** ప్రతి విషయాన్నీ ఇలా చూడటానికి ఒక ప్రత్యేకమైన దృక్పథం ఉండాలి కదా!

**గురువుగారు :** అవును, మనస్సుకు అలా చూడగలిగిన దృక్పథం ఉండాలి. అది మనల్ని మనం వంచించుకోకుండా, మన పథం మీద దృష్టిని కేంద్రీకరించి సద్గురువును ప్రేమించేదిగా ఉండాలి. మన ఆలోచనలకు, మాట్లాడే మాటలకు, చేసే పనులకు మధ్యగల అంతరాన్ని తగ్గించుకునేలా ఉండాలి. మీకు

అటువంటి నిజాయితీ ఉంటే బాబా మిమ్మల్ని ఆధ్యాత్మికపథంలో ఉన్నత శిఖరాలకు తీసుకువెళతారు.



మనం గంగానది వెంబడి ప్రయాణిస్తూ దానిని గమనించినపుడు, ఆ నదీ ప్రవాహానికి, మనలోని చైతన్య ప్రవాహానికి సారూప్యత కనిపిస్తుంది. మనం గంగానదిని ఒక పాయగా హృషీకేశ్ నుండి దేవప్రయాగ్ వరకు అక్కడి నుండి గంగోత్రి వరకు అనుసరించాం. కానీ మనం ఆ మూలస్థానానికి చేరుకున్నపుడు అక్కడ ఎవ్వరూ లేరు”[3] (ఆశ్యర్యంతో కూడిన గుసగుసలు) గంగోత్రి మొత్తం మనకోసమే అన్నట్లుగా! అదే నిస్సంగత్వం. దానిని బాబా మనకు చూపించారు. ఆయన దానిని మనకు ప్రసాదించారు. అక్కడ మనమూ, గంగానదీ – మనమూ, బాబా తప్ప ఇంకెవ్వరూ లేరు. అంత ప్రసిద్ధమైన యాత్రాస్థలంలో ఆ ప్రదేశం మొత్తం నిర్జనంగా మనకోసం సిద్ధంగా ఉంది! నేను అది అద్భుతమైన విషయం అనుకున్నాను. బాబా ఏం చేసారో చూడండి. అది సాధ్యమా అసలు? ఎవరన్నా ఊహించగలరా? అదంతటి అద్భుతమైన అవకాశం. మనం అలా ఉండాలని ఆశించలేదు, కానీ అక్కడికి వెళ్లేటప్పటికి అది అలా ఉన్నది. కాబట్టి **నువ్వు మూలంలోనికి వెళ్లినపుడు అక్కడ నిస్సంగత్వం ఉంటుంది. నువ్వు ఒక్కడివే ఉంటావు. ఆ మూలస్థానంలో నువ్వు, బాబా మాత్రమే ఉంటారు,** అందువలన ఈ ప్రయాణం మొత్తం, మన మార్గానికి సూక్ష్మరూపం. దీనిని బాబా చాలా స్పష్టంగా చూపించారు.

బాబా మనం చిన్న చిన్న ఆనందాలు అనుకునే వాటిని కూడా అలక్ష్యం చేయరు. వర్డ్స్‌వర్త్ “అన్ రిప్రూవ్డ్ ప్లెజర్స్” (ఎవరూ కాదనలేని చిన్న చిన్న ఆనందాలు) అంటాడు, ఆ వ్యక్తీకరణ నాకు నచ్చుతుంది. మీలో కొద్దిమంది “మాకు మంచు కావాలి” అన్నారు. మంచు కావాలి అనుకోవడం తప్పేమీ కాదు, చాలామందికి ఈ కోరిక ఉంటుంది. కొంతమంది మంచుకురవడం చూడాలనుకుంటున్నారు, అది మంచు కురిసే కాలం కాకపోయినా మంచు కురవడాన్ని ఔలీలో చూసారు. క్కడున్న వాళ్లను మంచు కురుస్తుందా అని అడిగినపుడు, వాళ్లు, “ఇప్పుడు కాదు, రెండు మూడు వారాల తరువాత డిసెంబర్ చివరి వారంలో కురుస్తుంది” అని అన్నారు. కానీ మనం పడుకొని తెల్లవారి నిద్రలేచేటప్పటికి మంచు కురుస్తోంది. ఇటువంటి చిన్న చిన్న కోరికలు, అభిలాషలు, ఈ “ఆనందాల”ను బాబా నెరవేరుస్తారు. ఈ మొత్తం ప్రయాణంలో ఆయన మనం కోరుకున్న దానిని ఎప్పుడు నెరవేర్చలేదో చెప్పండి. అది గంగోత్రిలో మనం ఏకాంతంగా ఉండటం కానివ్వండి లేక కురుస్తున్న మంచును చూస్తూ, ఆడుకుంటూ ఆనందించడంలాంటి చిన్నకోరికలు కానివ్వండి, ప్రతిదీ ఇచ్చారు.

**భక్తుడు** : అంతేకాదు గురువుగారూ, మనం ఒక్కరోజు తరువాత వచ్చుంటే ఖచ్చితంగా ఈ మంచు ఈ రోడ్లను కప్పివేసుండేది, మనం ఇక్కడికి రావడం దాదాపు అసాధ్యమయ్యేది.

**గురువుగారు :** అవును, బాబా సరైన సమయంలో సరైన ప్రదేశానికి పంపారు. మనమేమీ ప్లాన్ చేసుకోలేదు.



ప్లాన్ చేసుకోవాల్సిన అవసరమూ లేదు. నేను చెప్పదలచుకున్నదీ అదే. ఏదీ ప్లాన్ చేసుకోవాల్సిన అవసరం లేదు! బాబా ఉన్నారు. ఆయన చూసుకుంటారు. ఆయన మనకు అన్నీ చూపుతారు, అన్నీ ఇస్తారు. మనం ఉల్లాసంగా, సంతోషంగా ఆడుకుంటూ, పాడుకుంటూ ఆనందించాం. మనం మూలంలోనికి చేరుకున్నపుడు, ద్వారకామాయి[4] లాంటి గంగమ్మ ఒడిలో ఉన్నాం. మనం ఆమె బిడ్డలం, అక్కడ మనం ఆడుకోవాలి! ఆ తల్లికి తగ్గ బిడ్డల్లా ఉండాలి! మనం తల్లి ఒడిలో ఉన్నప్పుడు మనం ఎందుకు భయపడాలి? మనకు అటువంటి భావన, గుర్తింపు లేకపోతే గంగోత్రికి పోవడమెందుకు? మన మొత్తం ప్రయాణాన్ని ఇలాంటి దృక్కోణంలో చూసి అదేం తెలియచేస్తుందో ఆలోచించండి. మన ఆలోచనా విధానం ఒక క్రొత్త రూపాన్ని దిద్దుకుంటుంది (దీర్ఘమౌనం)... ఆ ఆనందాన్ని, పారవశ్యానుభూతిని, దాని జ్ఞాపకాలను మనకు సాధ్యమైనంతగా పొడిగించుకుందాం. **ప్రతి నిమిషం, ప్రతి క్షణం, మనల్ని నడిపిస్తున్న బాబా చేతిని నేను చూడగలుగుతున్నాను. బాబా మనకు ఎంత చూపిస్తున్నారు, ఎంత ఇస్తున్నారు!!**

**భక్తుడు** : ఆ ప్రయాణం వరకే కాక, బాబా ఎప్పుడూ అలానే ఉంటారు కదా గురువుగారూ!

**గురువుగారు :** అవును, నేను మీకు చెప్పేదీ అదే. మీ మొత్తం జీవితాన్ని ఇలా చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరలా చేసుకోలేకపోవచ్చు. కానీ ప్రయత్నించండి! మీకు కనీసం దాని గురించిన ఊహ, అస్పష్టమైన భావనైనా కలుగుతుంది. దానిని మీ జీవితంలో వాస్తవం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**భక్తుడు** : గురువుగారూ! మేము ఈ ప్రయాణంలో, చాలా వరకు ఏమీ తెలియకుండా ఉంటే ఎలా ఉంటుందో, ప్లానింగ్ లేకుండా ఏం జరుగబోతుందో తెలియకుండా ఉండటం ఎలా ఉంటుందో అనుభవ పూర్వకంగా చూసాము. ప్రయాణం చేస్తూనే ఉన్నాం కాబట్టి ప్రతిక్షణం క్రొత్తగానే ఉంది కానీ మేము తిరిగి ఇళ్లకు వెళ్లిపోయిన తరువాత నూతనత్వమనే అనుభూతిని సజీవంగా ఉంచుకోవడం ఎలా?

**గురువుగారు :** మీరు అంత ఎక్కువగా ప్లాన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ సంగతి మీరు గ్రహిస్తే చాలు. అవసరమైనపుడు అప్పటికప్పుడు ప్లాన్ చేసుకొని ఆనందంగా వెళ్లిపోతారు. మీరు అంతకుముందు వేసుకున్న ప్లాన్‌కు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. మీరు టిక్కెట్ బుక్ చేసుకున్నారనుకోండి. అప్పుడున్న పరిస్థితులను బట్టి "నేను ఫలానా రోజు బయలుదేరాలి" అని మీరే నిర్ణయించుకొని ఉంటారు. కానీ ఆ తరువాత మీరిక్కడే ఉంటం ఇంకా అర్థవంతంగా మారవచ్చు. అలాంటప్పుడు అంతకు ముందు వేసుకున్న ప్లాన్‌ను మార్చుకోవచ్చు. సాధారణంగా ఈ విషయాన్ని మనం మరచిపోతుంటాం. మనం ఒక్కసారి నిర్ణయం తీసుకున్నాక మనకది తప్పనిసరి అయిపోతుంది. "నేను టికెట్ బుక్ చేసేసుకున్నాను, నేను వెళ్లకతప్పదు, నేనేం చేసేది?" అంటారు. "నేనేం చేయాలి?" అంటే ప్రయాణం మానుకోండి లేదా వాయిదా వేసుకోండి. తీరా చూస్తే అది నీ నిర్ణయమే కదా. అలా కాకుండా నీకో ఉద్యోగం ఉండి ఉద్యోగరీత్యా వెళ్లాల్సి వచ్చిందంటే అది వేరే సంగతి. కనీసం అక్కడ ఒక కారణం అయినా ఉంది. అలా కానప్పుడు



ప్రయాణంలో ఇటువంటి చిన్న చిన్న మార్పులకు అంత ప్రాముఖ్యత ఇవ్వకండి.

ముందుగా ఇటువంటి స్వేచ్ఛను పొందుదాం, ఇప్పుడు సాధ్యమయ్యే ఈ కాస్త స్వేచ్ఛను సాదిద్దాం. మీరెప్పుడూ ఆ స్వేచ్ఛను (మోక్షం) గురించి మాట్లాడుతుంటారు. ముందు ఈ స్థాయిలో కనీసం ఈ స్వేచ్ఛతో ప్రారంభిద్దాం. మనం చాలా విషయాలకు బద్ధులమై ఉంటాం. మన స్వంత నిర్ణయాలకు బందీలుగా ఉంటాం. ఏదైనా అర్థవంతమైనది మనల్ని అటుకేసి లాగినపుడు దానిని అనుసరించనీయకుండా మనం ఇంతకు ముందు వేసుకున్న ప్లాన్‌లు మనల్ని ఆపుతాయి. దాని విషయంలో జాగ్రత్తగా ఉండండి. అదే మరింత గొప్ప పరివర్తనకు బాటలు వేస్తుంది (గురువుగారు నవ్వుతూ...)

బుద్ధుడు ఆ స్థితిని పొందినపుడు - అదేదైనా కానివ్వండి, మనకది అర్థం కాదు - ముందుగా మనస్సు వేసే అన్ని ప్రణాళికలు ఆగిపోయాయి. ఆయన బోధి వృక్షం క్రింద కూర్చున్నపుడు అక్కడి నుండి లేవాలి అన్న ఆలోచన ఆయనకు లేదు. ఆయన అలా కూర్చుండిపోయాడు, ఎన్ని రోజులు కూర్చోవాలి అనిగాని, మళ్ళీ లేవాలా లేక శాశ్వతంగా కూర్చుండిపోవాలా అనేటటువంటి ప్రణాళికలకు సంబంధించిన తలపు లేదు. ఆయన అలా కూర్చుండిపోయాడు. మనస్సు చేసే పరిశీలనలు, వేసే ప్రణాళికలు, సంకల్పాలు అన్నీ తొలగిపోయాయి. అవన్నీ తొలగిపోయిన తరువాత ఆయన ఆ స్థితిని పొందాడు. మనస్సు యొక్క సూక్ష్మమైన బంధాలను, నిబంధనలను అధిగమించడం చాలా కష్టం. ప్రయత్నించండి!

నేనిలా చెబుతున్నపుడు, ముందుగా ప్రయాణపు ప్లాన్‌ల వంటి స్థూలమైన విషయాలతో ప్రారంభించి వాటిని క్రమంగా తగ్గించుకోండి. అది మీకు స్వేచ్ఛగా జీవించే కళను నేర్పుతుంది. అది చాలా కష్టమైనదీ, అసాధ్యమైనదీ ఏం కాదు. నిజానికి చాలా అందంగా, ఆనందంగా ఉంటుంది.

**భక్తుడు** : గురువుగారూ! మేమందరం ఈ ప్రయాణాన్ని చాలా ఆనందిస్తున్నాము. ఎక్కడికి వెళుతున్నామో ఎలా వెళుతున్నామో, ఎప్పుడు వెళుతున్నామో ఎవ్వరికీ తెలియదు (నవ్వులు), ఇది చాలా అందమైన అనుభూతి.

**గురువుగారు :** మీ జీవిత స్వరూపాన్ని లఘురూపంలో, సూక్ష్మ ప్రమాణంలో తెలియచేయాలనుకుంటున్నాను. అయినా మీరు (వాస్తవ జీవితంలో) ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలుసా?(గురువుగారు నవ్వుతూ...) మీరలా జీవిస్తున్నారంతే! మీరందరూ ఎక్కడికో వెళుతున్నామని అనుకుంటున్నారు. - ఓ గమ్యం, ఓ లక్ష్యం ఉందనుకుంటున్నారు - కానీ నిజానికి అది మిథ్య, ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలియదు. నేను దాని రుచిని మీకు చవి చూపించాలనుకుంటున్నాను. మనం ఎక్కడికి వెళుతున్నాము అనే ఆలోచనలు కాస్త ప్రక్కన పెట్టండి. మనం ఎందుకు వచ్చాం, మనం ఎందుకు పుట్టాం, ఎందుకు బ్రతుకుతున్నాం? మనకు ఇటువంటి ముఖ్యమైన విషయాలే తెలియనపుడు, ఈ చిన్న ప్రయాణంలో ఆ సంగతి తెలియకపోతే ఏమిటి?



మీకు గనుక ఆ పెద్ద ప్రయాణం గురించి తెలుసుకోవాలని ఉంటే, ఇప్పుడు ఇక్కడ ఈ చిన్న ప్రయాణంలో వాటి గురించి తెలుసుకోండి. దీనిని గనుక **మీరు సరైన పద్ధతిలో తీసుకోగలిగితే, బాబా చేతిలో పగ్గాలు ఉంటే ఎలా ఉంటుందో అర్థమవుతుంది. ఆయన మన జీవన రథాన్ని నడుపుతున్నారు, ఆయనకు గమ్యం తెలుసు. ఆయన మనల్ని మన గమ్యానికి సురక్షితంగా చేరుస్తారు. మనలో మనం ఆందోళన చెందడం ఎందుకు? ఆయనకు తెలుసు. మీరు దీనిని (ఈ ప్రయాణాన్ని) అలా తీసుకుంటే అది సాధనవుతుంది.** దానిని మీరు అలా తీసుకుంటారనే అనుకుంటాను. అందుకే నేను అలా చేస్తాను. లేదూ మీరు దానిని అలా తీసుకోకున్నా మంచిదే. అదో క్రొత్తరకమైన అనుభవం, అంతే! అలా కాకపోతే మొత్తం కార్యక్రమాన్ని ముందే చెప్పడంలో ఇబ్బందేముంది? దానిని మనం అనుసరిస్తున్నామా లేదా అన్నది తరువాత సంగతి. (చాలా నవ్వులు) నేను మీకు కార్యక్రమం అంతా చెప్పేసి తరువాత అది మారింది అని చెప్పవచ్చు, దానిని మళ్లీ మార్చవచ్చు. ప్రతిసారీ మీరు ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలుసు అనే భ్రమ ఉంటుంది. అది ఇప్పటి మీ జీవితాల మాదిరిగా ఉంటుంది – అదే రకమయిన భ్రమ. కాబట్టి ఈ ప్రయాణం మన జీవితాలకు మన జీవన ప్రయాణానికి ఒక నమూనా, ఒక దర్పణం, ప్రతిబింబం వంటిది. మన జీవితం స్థూల రూపమయితే ఈ ప్రయాణం దానికి సూక్ష్మమైన రూపం. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ! ఈ సూక్ష్మరూపం ఇలాగే కొనసాగాలని నేను నిజంగా ప్రార్థిస్తాను.

**గురువుగారు :** అవును, అది నీకు అర్థమైతే, దానికి ముగింపు ఉండదు. అది స్థూలంగా మారిపోతుంది, దానికి అంతం ఉండదు!

---

*గురువుగారు వారి బృందంతో గంగోత్రిని సందర్శించినపుడు, అద్భుత రీతిన గంగోత్రి నిర్మానుష్యంగా ఉంది, అక్కడ నివసించే స్థానికులతో సహా ఇతర యాత్రికులు ఎవ్వరూ అక్కడ లేరు. తత్ఫలితంగా గురువుగారు గంగోత్రి స్వచ్ఛమైన రమణీయతను ఏకాంతంగా (నిస్సంగంగా) ఆస్వాదించగలిగారు. అద్వైత వేదాంతంలోను, కబీరుతో ప్రారంభమైన (నిర్గుణ) భక్తి సంప్రదాయాలలో నిస్సంగత్వాన్ని చరమలక్ష్యమైన ముక్తికి సాధనంగా చెప్పడం జరుగుతుంది.*

*ద్వారకామాయి – శిరిడీలో బాబా తాము నివసించిన మసీదును ద్వారకామాయి అని పిలిచెడివారు. “నీవిప్పుడు కూర్చున్నదే ద్వారకామాయి. ఎవరైతే ఆమె ఒడిలో కూర్చొనెదరో వారిని ఆమె కష్టముల నుండి యాతురతల నుండి తప్పించును. ఈ మసీదు తల్లి చాలా దయార్ద్ర హృదయురాలు. ఆమె నిరాడంబర భక్తులకు తల్లి. వారిని ఆపదల నుండి తప్పించును. ఆమె ఒడినాశ్రయించిన వారి కష్టములన్నియు సమసిపోవును. ఎవరామె నీడనాశ్రయించెదరో వారికి ఆనందం కలుగును” అన్న సాయి పలుకులను గురువుగారు ఉదహరిస్తున్నారు.*



## ఊదీ - మే *2013*

**భక్తుడు** : గురువుగారూ! బాబా ప్రతిరోజూ రాత్రిపూట భక్తులకు ఊదీ ఇచ్చేవారు, మీరు కూడా మాకు కొన్ని సందర్భాలలో ఊదీ ఇస్తారు. ఊదీ దేనికి ప్రతిరూపం? ఊదీకి, ఆనందానుభూతికి సంబంధం ఏమిటి?



**గురువుగారు :** ఊదీ అనేది బాబా అనుగ్రహానికి చిహ్నం. నాకు అది బాబా అనుగ్రహంగా అనిపిస్తుంది, ఎందుకంటే అది పవిత్రమైన ఆయన ధుని నుండి ఉత్పన్నమవుతుంది. నేను మీకిచ్చేది మామూలు విభూతి కాదు – బాబా స్వయంగా వెలిగించి సుమారు అరవై సంవత్సరాలపాటు ఆయన కళ్లముందర ఉన్న పవిత్రమైన ధుని నుండి తీయబడిన బూడిద అది. అప్పటి నుండి అది అలా నిరంతరం జ్వలిస్తూనే ఉంది. ఎప్పుడైనా బాబా తమ అనుగ్రహం గురించిగాని, ప్రసాదం గురించిగాని మాట్లాడాల్సి వచ్చినపుడు ఆయన ఊదీనే ప్రతీకగా చెప్పేవారు. కోరికలు తీర్చడానికైనా, ప్రార్థనలకు సమాధానం చెప్పడానికైనా బాబా ఊదీనే ప్రతీకగా చెప్పేవారు. “నా భాండాగారపు తలుపులు తెరచిపెట్టబడి ఉన్నాయి” అని బాబా అనేవారు. ఆయన భాండాగారంలో ఏముంది? బస్తాల కొద్దీ ఊదీ! “నా భాండాగారం తెరచి ఉన్నది, తీసుకోండి. ఎవ్వరూ అడ్డు చెప్పరు!” బాబా ఊదీ వారి అనుగ్రహానికి చిహ్నం. నేను ఊదీ ఇస్తున్నానంటే నేను కేవలం బాబా అనుగ్రహాన్నే మీకు అందిస్తున్నాను. అంతకుమించి దానికి వేరే ప్రాముఖ్యతను నేను ఆపాదించను.

**భక్తుడు** : (మనలో) పరివర్తన రావడానికి, ఊదీకి సంబంధం ఉందా?

**గురువుగారు :** అవును. అనుగ్రహం మిమ్మల్ని మారుస్తుంది.

**భక్తుడు** : మేము ఊదీని ఇంటి వద్ద ధరించాలా / పెట్టుకోవాలా?

**గురువుగారు :** మీరు బాబా ఊదీని ఆయన అనుగ్రహానికి గుర్తుగా భావిస్తున్నట్లయితే, తప్పకుండా పెట్టుకుంటారు. ఈ ప్రశ్నలోని మరో అంశం ఏమిటంటే, “బాబా అనుగ్రహాన్ని మా ఇంటికి తీసుకెళ్లమంటారా” అని నన్ను మీరడుగుతున్నట్లు అనిపిస్తోంది. అలా అయితే, “అవును, నేను తీసుకెళ్లమనే అంటాను (గురువుగారు నవ్వుతూ...) మీరు దానిని బాబా అనుగ్రహానికి గుర్తుగా భావిస్తే, తప్పకుండా తీసుకెళ్ళండి. మీరు ఊదీకి అంత ప్రాధాన్యత ఇవ్వకపోతే తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. మీరు ఊదీని అంత ముఖ్యమైనదిగా భావించి తీరాలని నేను అనుకోవడం లేదు. అది మీ ఇష్టం. నేను నా వరకు ఊదీని బాబా కృపగా భావిస్తాను. అది నా సెంటిమెంట్ (భావోద్వేగాలు)తో ముడిపడిన విషయం కూడా. ఎందుకంటే, అది బాబా ధుని నుండి వచ్చింది. దానికి ఆయన స్పర్శ, సాన్నిధ్యం ఉంది. ఆ స్పర్శ, సాన్నిధ్యం ఉన్నది ధునికే



అయినా ఊదీ ఆ ధునిలో మండుతున్న అగ్ని యొక్క ఫలితం. అందువలన వారి సాన్నిధ్యం, స్పర్శ ఆ ధునిలోని ఊదీకి ఖచ్చితంగా ఉంది.

**భక్తుడు** : ప్రేమ కోసం పరితపిస్తున్నపుడు అందులో అహంకారానికి తావుంటుందా?

**గురువుగారు :** అవును, అహంకారానికి చోటు ఉంటుంది. ప్రేమ కోసం తపించడాన్ని జ్వలిస్తున్న అగ్నితో పోల్చవచ్చు. నీకు అనుభవమయ్యే ప్రేమ రగులుతున్న అగ్నిలాంటిది. అహం దానికి కట్టెలుగా మారుతుంది. అక్కడ మంట ఉంది, కట్టెలూ ఉన్నాయి. కట్టెలు ఉన్నంత వరకు మంట మండుతూనే ఉంటుంది. మంట అలా కట్టెలు ఉన్నంతసేపూ మండి, తరువాత ఆరిపోతుంది. ప్రారంభంలో కట్టెలు మంట మండటానికి ఊతమిచ్చి దానిలో కలసిపోయినట్లుగానే మన అహం ఆ ప్రేమ జ్వాలలో కలసిపోవడానికి ప్రయత్నిస్తుంది. ఏ కట్టెను తీసుకున్నా అది మంటను ప్రతిఘటిస్తుంది. ఎందుకంటే దానికంటూ కొన్ని ధర్మాలు, అస్తిత్వం ఉంటాయి. దానికి తగలబడిపోవాలని (నశించిపోవాలని) ఉండదు. ఈ కట్టెలు మాదిరిగానే ఈ అహంకారాలన్నీ ప్రతిఘటిస్తాయి. కానీ మంట పెద్దదైనపుడు, ఇంకా ప్రజ్వరిల్లినపుడు అవి తగలబడిపోతాయి! అవి పూర్తిగా మండిపోయాక మిగిలేదే ఊదీ – మనకు బాబా ఇచ్చేది అదే. ఎందుకంటే ఆయన అహం పూర్తిగా మండిపోయింది, ఆయనలో మిగిలినది కేవలం ఊదీ – మహిమ, అనుగ్రహం మాత్రమే. ఊదీ అంటే మొత్తం దహించబడి, ఇక దహింపబడటానికి ఏమీ మిగలని ఆ ప్రేమాగ్ని యొక్క చివరిస్థితి. అదీ ఊదీ అంటే. దీనిని గుర్తు పెట్టుకోవడం కోసం, దానిని మన దేహంలో ముఖ్యభాగమైన నుదుటిమీద పెట్టుకుంటాం. అది ఆయన ప్రేమతో నిండి ఉంటుంది, ఎందుకంటే ఆయన ప్రేమ మిగిలించిన శేషమది. ఊదీ ఒక గుర్తు, వాహకం. అదే సమయంలో మనకు (బాబా ప్రేమను) గుర్తు చేసే జ్ఞాపిక.

**భక్తుడు** : గురువుగారూ! నిజమైన తపస్సు అంటే ఏమిటి?

**గురువుగారు :** తపస్సు అనే పదం 'తప్' అనే ధాతువు నుండి పుట్టింది. తప్ శబ్దానికి కాల్చుట, వేడిమి అనే అర్థాలున్నాయి. అది అన్వేషకుడు తన తీవ్రసాధనా ఫలితంగా పొందే అపరిమితమైన పరితాపం నుండి బయల్పడే వేడి. ఎవరైనా ఏదైనా తీవ్రమైన కోరికతో ఉంటే మనం మామూలుగా ఏమంటాం? "కోరికతో రగిలిపోతున్నాడు" అంటాం కదా. మనం రగలడం అనే పదాన్నే వాడుతాం, అదీ తపస్సు అంటే. ఎవరైనా ఈ తాత్వికమైన ప్రశ్నలతోనో, భగవత్ సాక్షాత్కారం కోసమో, లేదా మహోన్నత లక్ష్యంతోనో రగిలిపోతుంటే – ఆ కోరిక ఎంత బలంగా ఉంటుందంటే అది అతనిలో వేడిని పుట్టిస్తుంది. అదీ తపఃశబ్దం తెలియచెప్పే వేడి. మనస్సులో ఆ జ్వాల నిరంతరం ఉండేలా చూసుకుంటూ దానిని ఇంకా ఇంకా పెంచుకుంటూ పోవడమే తపస్సు అంటే. తపస్సంటే శరీరాన్ని వివిధ రకాల కేశ్లాలకు గురిచేయడం, పద్మాసనంలో కూర్చోవడం లేదా బట్టలు లేకుండా హిమాలయాలకు పోవడమో కాదు. ఇటువంటి ఆత్మహింసాకర అభ్యాసాలు తపస్సు కాదు. సత్యాన్ని తెలుసుకోవాలని పరితపించే వాళ్లలో ఆ సత్యంపట్ల



గల పరితాపం ఎంతగా ఉంటుందంటే అది వారిలో ఎంతో వేడిని పుట్టిస్తుంది. మీరు చూసే ఉంటారు కొందరు కేవలం కౌపీనం మాత్రమే ధరించి మంచు మీద నడుచుకుంటూ పోతుంటారు. అతని అంతరంగంలో ఎంత వేడి ఉంటుందంటే ఆ చలిలో కూడా ఆ (అంతరంగంలోని) వేడి అతనికి సరిపోతుంది.

అరుణాచలానికి రాక మునుపు కలిగిన మరణానుభవాన్ని గురించి భగవాన్ ప్రస్తావిస్తూ, "అప్పుడు వేడిని తలపించే మెరుపులాంటి ఆనందోద్రేకం కలిగింది. అయితే ఆ సమయంలో శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉందో లేదో మాత్రం స్పష్టంగా తెలియదు" అన్నారు. వారి శరీరం ఆయన నిజంగా జ్వరంతో బాధపడుతున్నారా అనిపించేటంతటి ఉష్ణోగ్రతను కలిగి ఉండేది.

లౌకికమైన మన రోజువారీ జీవితంలో కూడా అంతే. మీకు ఒక తీవ్రమైన కోరిక ఉందనుకోండి,మీ శరీర ఉష్ణోగ్రత పెరిగినట్టనిపిస్తుంది, అది వేడిని పుట్టిస్తుంది. తీవ్ర సాధనా ఫలితంగా పొందే అపరిమితమైన పరితాపం నుండి బయల్పడే వేడిని అలా ఉంచుకోవడమే నిజమైన తపస్సు అంటే. మీరు ఆ వేడిని నిలుపుకోగలిగితే అదే నిత్యాగ్నిహోత్రం. అఖండమైన అగ్ని ఆరాధన – అదీ నిజమైన ధుని, నిజమైన అగ్ని ఆరాధన, నిజమైన యజ్ఞం, నిజమైన తపస్సు. ఆ పదానికి ఉన్న అర్థమే అది. మంట, రగిలిపోవడం. తపస్సు చేయడం అంటే తపించడం, రగిలిపోవడం. చివరకు బూడిద మాత్రం మిగిలేవరకు రగిలి రగిలి పోవడం.

**భక్తుడు** : *ప్రేమించడమే ఒక రకమైన తపస్సు కదా, రగలడం కదా?*

**గురువుగారు :** అవును. అది తపస్సే. ఎందుకంటే అది రగులుతుంది. అవును, అందరూ అంటూ ఉంటారు... "నా ప్రేమ నన్ను కాల్చివేస్తుంది, నా పరితాపం నన్ను దహించివేస్తుంది" అని. వాళ్లు చెప్పేదీ అదే. రమణులు వాడిన పదం కూడా "దహించివేస్తుంది" అనే. అటువంటి ప్రేమ అనే అగ్నిని నిరంతరమూ నిలుపుకోమనే మహర్షులు ప్రబోధించింది. మీరు లక్ష్యాన్ని పొందేవరకు ఆ మంటను నిరంతరం జ్వలించే జ్వాలగా చేసుకోండి.

**గురువుగారు :** మనస్సు, శరీరాన్ని చిత్రహింసలకు గురిచేయడం, తీవ్రమైన వైరాగ్యం మొదలైన ఆలోచనలతో మీరు ప్రక్కదారి పట్టకండి. అవి సహజంగా సిద్ధించాలి. ఏదైనా కోరికతో తపించిపోయేవారు దేనినీ పట్టించుకోరు. నిజంగా కోరికతో పరితపించే వారిలో మీకది కనిపిస్తుంది. అటువంటి వ్యక్తి తపించి పోతుంటాడు. అతనికి ఆకలి తగ్గిపోతుంది, అతను చాలా కొద్ది ఆహారంతో జీవించగలుగుతాడు. (జఠరాగ్ని) ఆకలి ఎక్కువ కాకపోగా అతనికి ఆహారం అవసరం ఉండదు. "ఇది నాకు చాలా ముఖ్యమైన సమస్య, నేను ఈ సమస్యను పరిష్కరించాలి, దీనిని సాధించాలి, ఆ తరువాతే నేను భోజనం చేస్తాను" అంటాడు. నిజంగా అంతగా తపించిపోయేవాళ్ళకు ఇలా జరుగుతుంటుంది. చాలా సహజంగా జరుగుతుంది. కానీ



చూసేవాళ్లకు, వాళ్ల కోరికకు కారణం వాళ్ల చర్యలు అనుకుంటారు, అందుకని వాళ్లను అనుకరిస్తూ కఠినమైన సాధనలు చేయడం మొదలుపెడతారు.

రమణమహర్షి తిరువణ్ణామలై వచ్చినపుడు, పరిసరాల గురించి అస్సలు పట్టింపు లేకుండా అరుణాచలేశ్వరుని ఆలయంలో కూర్చుండిపోయాడు. ఆయనకు అవసరాలంటూ ఏమీ లేవు. ఆహారము కూడా లేదు. అప్పుడప్పుడూ ఎవరో అభిషేకం చేసిన పాలను కాసిన్ని స్పూన్‌లు ఇచ్చేవారు, అంతే. ఆయనకు అది సరిపోయింది. అంతేగాని నువ్వు రెండు మూడు స్పూన్లు పాలు తీసుకొని ఆకలితో అలమటిస్తూ ఉంటే దానివల్ల ప్రయోజనం ఉండదు – నువ్వు రమణమహర్షివి కాలేవు (గురువుగారు నవ్వుతూ...)

అదీ అగ్ని అంటే, అదీ తపస్సంటే, వేదాలలో చెప్పిన నిజమైన అగ్ని ఆరాధన ఇది. ఇదీ యజ్ఞం. మనలో ఆ జ్వాలను రగిలించి, ప్రజ్వరిల్లచేసేవన్నీ దానికి ఆజ్యం – సత్సంగం, సద్గ్రంథాలు చదవడం, మహాత్ముల చరిత్రలు చదవడం, పుణ్యక్షేత్రాలకు వెళ్లడం – ఇవన్నీ ఆ అగ్నిని రగిలించి దానిని ఇంకా ఇంకా ప్రజ్వరిల్లచేసే ఇంధన ద్రవ్యాలు. అప్పుడు అగ్ని జ్వాలగా మారి నీకు అవసరం లేని వాటన్నింటిని పూర్తిగా దహించివేస్తుంది. అప్పుడిక మిగిలేదే ఊదీ, అదే విభూతి. విభూతి అంటే సంస్కృతంలో శక్తి అని కూడా అర్థముంది. అంటే మహిమ, జ్ఞానం. మనం బాబా ఊదీని పెట్టుకున్నపుడు అది బాబా మహిమకు, జ్ఞానానికి చిహ్నం.

**గురువుగారు :** నా ఆధ్యాత్మిక జీవితమూ, ప్రాపంచిక జీవితమూ మధ్యన వైరుధ్యమేదీ లేదు. అత్యంత ధనవంతుడైనా, అమిత పేదైనా నాకు ఇవ్వగలిగింది ఏమీ లేదు. ఎవ్వరివద్ద నుండీ ఏదీ తీసుకోకపోవడం నా నియమం. ఇచ్చేవాడు ధనవంతుడా, పేదవాడా అని నేను పట్టించుకోను. ఎవ్వరి వద్ద నుండి ఏదీ ఆశించాల్సిన అవసరం నాకు లేదు. ఎందుకంటే నేను బాబా మీద తప్ప మరెవ్వరి మీదా ఆధారపడిలేను. నేను నా ఇంట్లో ఉంటాను, అందరూ వస్తారు, సాయిభక్తులూ వస్తారు – వాళ్ళకు నేను ఇవ్వగలిగింది ఏముంది? నేను వాళ్ళకు బాబా ఊదీ ఇస్తాను. వాళ్ళకూ ఊదీ తీసుకోవడం ఇష్టదాయకమే. బాబా ఊదీ ఇవ్వడానికి, వారి కోసం బాబాను ప్రార్థించడానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు. నేను చేసేది అంతే. నేను వాళ్ళను సాయిస్వరూపులుగా చూస్తాను. అందుకే సాయిభక్తులు చాలా మంది వస్తారు.

**గురువుగారు :** నేను స్నానం చేసిన తరువాత, నుదుటిమీద ఊదీ పెట్టుకుంటాను. నేను దానిని ఆచారంగా చేస్తున్నానని అనుకునేవాల్లు కొందరున్నారు. ప్రతిరోజూ నేను బాబాను తలచుకొని ఊదీ పెట్టుకుంటాను – ఇది ఆచారంలా కనిపిస్తుంది. ప్రతిరోజూ చేసేదాన్ని నేనూ ఆచారమనే అంటాను. కానీ నాకు బాబా ఊదీ పెట్టుకోవడం ఆచారంలా అనిపించదు. **నా గురువుకు నేను చేసుకున్న చివరిసేవ ఊదీ పెట్టడం. మాస్టరుగారు సమాధి చెందిన తరువాత, ఆయన పార్థివదేహానికి నుదిటిమీద చివరిగా నేను ఊదీ పెట్టాను.**



**ఆ తరువాత ఆయనను సమాధి చేయడం జరిగింది. అది నేను మాస్టరుగారికి చేసుకున్న చివరిసేవ, నాకు ఆయనపట్ల ఉన్న ప్రేమకు కడపటి వ్యక్తీకరణ అది. నేనెప్పుడూ ఊదీ పెట్టుకున్నా, ఆయనను గుర్తుకు తెచ్చుకుంటాను. అది నేను చేసుకున్న చివరి సేవ. నేను నా పద్నాలుగు సంవత్సరాలపాటు ఆయనతో ఉండి చేసుకున్న సేవల యొక్క స్ఫూర్తి మొత్తం ఆ చివరి సేవకు ఉంది.**

**గురువుగారు :** మనం ఊదీ పెట్టుకుంటున్నామంటే అది ఆచారం కాదు. భస్మధారణ వంటి సాంప్రదాయం కాదు. శిరిడీలో ధుని బాబా వెలిగించడం మూలాన అది బాబా స్పర్శను కలిగి ఉంది. ఆ ధుని నుండి తీయబడిన బూడిద, ఇన్ని తరాల తరువాత కూడా, పరోక్షంగానైనా నా ఇష్టదైవమైన బాబా స్పర్శను కలిగిఉంది. నేను బాబా ఊదీని నా శరీరంలో అత్యంత ముఖ్యభాగమైన (నుదుటన) ధరిస్తాను. అప్పుడు నేను బాబా స్పర్శను నిరంతరం అనుభూతి చెందగలను. మీరొచ్చి అడిగినపుడు అంతకుమించి నేను ఇవ్వగలిగినదేముంది? బాబాతో స్పృశించబడిన ఊదీని, అందులోని ఆయన స్పర్శ మాత్రమే నేను మీకు ఇవ్వగలను. అందుకే నేను ఊదీ ఇస్తాను. అంతే తప్ప భస్మధారణ అనే హైందవ సాంప్రదాయాన్ని అనుసరించి కాదు – నేను అసలు ఆ విషయమే పట్టించుకోను. ఊదీ పెట్టుకోవడం నా ప్రేమకు వ్యక్తీకరణ, అది మీకూ అలానే ఉండాలి, కేవలం ఆచారం కాకూడదు. నేను సాధారణమైన భస్మాన్ని పెట్టుకోవడం లేదు. అది బాబా వెలిగించిన ధుని నుండి వచ్చింది. **ఊదీ ఆయన స్పర్శకు, అనుగ్రహానికి గుర్తు.** ఆ స్పర్శానుభూతిని నేను నుదుటన ధరిస్తాను. మనం ఊదీ పెట్టుకుంటున్నామంటే ప్రతిసారీ అది ఆయన స్పర్శను అనుభూతి చెందడమే.

ఆచారాలను ఈ దృష్టితో చూడటానికి ప్రయత్నించండి. అప్పుడు మీరు వాటిని అర్థం చేసుకోగలుగుతారు. అలా కాకపోతే భారతీయులను అనుకరిస్తూ రుద్రాక్షలు ధరించడం, బొట్టు పెట్టుకోవడం వంటి చిత్రమైన పోకడలకు దారితీస్తుంది. భారతదేశంలో ప్రతిదీ పవిత్రమైనదని కాదు! ఆ కారణంగానే నా చుట్టూ మీకు ఎటువంటి ఆచార వ్యవహారాలు, తంతులు కనిపించవు. నేను వాటి గురించి పట్టించుకోను. కానీ **మన ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి ఉపకరిస్తున్నంతవరకు నేను ఆచారాలను, పూజావిధులను గౌరవిస్తాను.**

**గురువుగారు :** నేను చెప్పేది ఏమిటంటే, బాబా మీకు ఎంతో ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్నారు. ఆయన ఎదురుచూస్తున్నారు, ఆయన చెప్పినట్టు "బండ్లకొద్దీ ఊదీ ఉంది, బండ్లలో తీసుకువెళ్లండి".

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com**

**సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**



# సద్గురువు ఒక సజీవ దర్పణం - *జూన్ 2013*

**భక్తుడు** : మా జీవితాలలో ఎప్పుడైనా బాధలు తగ్గుముఖం పట్టే సమయం వస్తుందా?

**గురువుగారు :** ఎప్పుడైతే నీలో ఏదో లోపిస్తుంది అని తెలిసి, (అది ఏమిటో, ఏమి లోపిస్తుందో నీకు స్పష్టంగా తెలియకపోయినా) దానిని పొందడానికి నీకు మార్గం దొరికినపుడు అప్పటి నుండి ఆ లోటు పూడకపోయినా, కనీసం ఆ వెలితిని పోగొట్టే మార్గం దొరికినందుకు సంతోషంగా ఉంటుంది. అప్పటి నుండి నీ మార్గం కష్టంగా దుఃఖంతో నిండి ఉండదు. సంతోషంతో నిండి ఉంటుంది. అప్పుడు కూడా ఇంకా దుఃఖంలో ఎవరైనా ఉన్నారంటే వారికి సరైన అవగాహన లేనట్లే. వారికి దానిలోని రసానుభూతి అర్థం కానట్లే. నేను దానిని ప్రక్రియ అని పిలిచినపుడు దానిని మీరు అపార్థం చేసుకోవద్దు. "ఓహో, గురువుగారు మనలను ఒక మార్గంలో ప్రవేశపెడతారు. ఆ మార్గంలో మొదట బాగా కష్టపడాలి, దుఃఖం అనుభవించాలి. అలా కొంత అనుభవించిన తరువాత మన అంతరంగంలో నుండి ఏదో బయటకు వస్తుంది. గురువుగారు అంతరంగపు లోతుల నుండి ఏదో బయటకు తీస్తారు".... అవన్నీ అర్థంపర్థంలేని ఆలోచనలు. మీలో అంత లోతులేవీ లేవు నేను బక్కెట్టుతో తోడడానికి. మీలో వున్న లోపాలు మీకు తెలిసినపుడు మీ హృదయం వికసించే ప్రక్రియ మొదలవుతుంది. అలా మీ హృదయం వికసించే ఆ ప్రక్రియతో మీలో పేరుకొనివున్న చెత్త మీకే అవగాహనకు వస్తుంది. ఎవరూ వీటిని మీ దృష్టికి తీసుకు రానవసరం లేదు. సద్గురువు ఒక అద్దంలా పనిచేస్తారు. అది బాహ్య వస్తువులను చూపించే మామూలు అద్దం కాదు. దానిలో మిమ్మల్ని (మీలో ఉన్న గుణాలు) మీరే చూసుకుంటారు.



కొంతమందికి వారిలో ఉన్న లోపాలే కనబడతాయి. చంద్రునిలో ఉన్న మచ్చలను చూసినట్లుగా. వారు చంద్రుని చూస్తారు. చూసి, 'ఎంతో అందంగా ఉంది ఈ చందమామ! కానీ దానిలో కొన్ని మచ్చలున్నాయి' అంటారు. కొంతమందికి ఆ స్వభావం ఉంటుంది. వారు ఆ జాబిలి అందాన్ని, ఆ వెన్నెల అందాన్ని చూడటానికి బదులు ఆ మచ్చలనే చూస్తారు. కొంతమంది ఆ అద్దంలో ప్రతిబింబించిన అందమే చూస్తారు. కానీ ఆ వెలుగులో మాలిన్యాన్ని, మచ్చలను చూడరు. వారి అనుభవం - ఆ అందం యొక్క రసానుభూతిని ఆస్వాదించడం, దానితో సంతోషాన్ని పొందడం.

**భక్తుడు** : కానీ మా విషయంలో మేము ఆ మచ్చలను, మాలిన్యాన్ని చూడాల్సిన అవసరం లేదా?

**గురువుగారు :** అవును, చూడాలి. కానీ వాటిపట్ల మీకుండే భావం భిన్నంగా వుంటుంది.

**భక్తుడు** : మా గురించి మేము తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం కదా?

**గురువుగారు :** అవును నిజమే. నీ గురించి నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నించు! భగవాన్ చెప్పిందీ



అదే. అయితే అదంత సులభం కాదు. నేను కూడా అదే స్పష్టంగా చెబుతున్నాను. లక్ష్యం యొక్క వాస్తవికతను చూడటానికి ప్రయత్నించవద్దు. కర్తను, అంటే – నీ యొక్క వాస్తవికతను తెలుసుకోవడానికి ప్రయత్నించు. అది ఎంతో ముఖ్యమైనది. నిన్ను నువ్వు స్పష్టంగా తెలుసుకోవడానికి చేసే ప్రయత్నంలో నీకు ఏదైతే ఉపయోగపడుతుందో దానిని ఎంపిక చేసుకొని దానితో ముందుకెళ్ళు. అది నిన్ను నీవు అద్దంలో చూసుకోవడంలా ఉంటుంది. **సద్గురువే ఆ అద్దం. అద్దం యొక్క తత్త్వం ఏమిటి? అది నీ రూపాన్ని నీకు మరింత సంపూర్ణంగా సుస్పష్టంగా చూపిస్తుంది, దానిని చూసి నీకిష్టమైన రీతిలో నీ రూపానికి నువ్వు మెరుగులు దిద్దుకోవచ్చు.** అద్దం ముందు నిలబడి తయారయ్యేవారందరూ ఒకే రకంగా తయారుకారు. ఎవరికి వారు అందం పట్ల వారికుండే భావనను బట్టి తయారవుతారు. ఒకామె జుట్టు ఇలా దువ్వుకుంటే మరొకరు అలా దువ్వుకుంటారు.

**భక్తుడు :** అంతర్ముఖం కావడానికి బదులు బహిర్ముఖంగా చూడటమనే అలవాటు చేసుకుంటూ జీవితాన్ని ఇన్నాళ్ళూ గడిపేశాం. ఇప్పుడు ఆ అలవాటును తారుమారు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామా?

**గురువుగారు :** అవును, దానినే ఆధ్యాత్మికత అంటారు. ఆధ్యాత్మిక సాధనంతా ఆ అలవాటును పోగొట్టుకోవడమే.

**భక్తుడు :** మాకు మేమే లక్ష్యవస్తువుగా ఉండాలనా మీ ఉద్దేశ్యం?

**గురువుగారు :** ఒక విధంగా చూస్తే నిజమే. లక్ష్యానికి చేరాల్సిన కర్త మనమే, లక్ష్యమూ మనమే. అప్పుడు కర్త లక్ష్యమవుతాడు, లక్ష్యమే కర్తవుతాడు.

**భక్తుడు :** గురువుగారూ, మా లక్ష్యవస్తువులను సద్గురురూపంలో చూడటం ద్వారా మాలో మార్పు కలుగుతుందా?

**గురువుగారు :** నేను దానిని మార్పు అని అనను. నిజానికది రూపాంతరం చెందడంలాంటిది, మార్పు చెందడం కాదు. ఒక పక్షి మనిషిలాగా ఎప్పటికీ మార్పు చెందదు. ఈ పద్ధతి గొంగళిపురుగు సీతాకోకచిలుక రూపాన్ని సంతరించుకోవడంలా ఉంటుంది. అదే పరివర్తన (హృదయం) వికసించడం. అక్కడ మరుగనేది ఏమీ ఉండదు. మొత్తం తేటతెల్లంగా ఉంటుంది. మన నిజస్వరూపం, మనలోని తపన అట్టడుగు పొరల్లో ఎక్కడో దాగి ఉంది. మనమిప్పుడు ఆ పొరలను తొలగించి దేనినో తెలుసుకోబోతున్నాం. మన కృషి అంతా అదే. మన నిజస్వరూపాన్ని మరింత స్పష్టంగా చూపించి, మనం తపిస్తున్న దాని కోసం కృషి చేయాలని తెలియచేసే అద్దంలాంటి వారు సద్గురువు. ఫలితంగా నువ్వు కావలసిన దానికోసం మరింతగా ప్రయత్నించగలవు. మీరు దీనిని గుర్తుపెట్టుకోవడానికి మీకొక పోలిక చెబుతాను. ఉదాహరణకు, నువ్వు "రేపు చెయ్యాల్సిన పనులు కొన్ని వున్నాయి, వాటికి సంబంధించిన చేయవలసిన పనుల లిస్ట్‌ను తయారుచేసుకోవాలి" అని ఒక లిస్టు తయారుచేసుకుంటావు. తరువాత సందర్భానుసారం నీ లిస్టును నువ్వు సరిచూసుకుంటావు. ఈ చెయ్యవలసిన పనుల లిస్టు ఏం చెబుతుంది? అది నీకు "ఇది చేసేశాను,



ఇది చెయ్యాలి, ఇది మర్చిపోయాను" అనే విషయాలను తెలియచేస్తుంది. దానిని నీకు ఎవ్వరూ ఇవ్వలేదు. దానిని తయారుచేసుకుంది నువ్వే. ఆ లిస్టు నీకు మార్గదర్శకక్షేత్రం అవుతుంది – క్రైస్తవుల పది ఆజ్ఞల (టెన్ కమాండ్‌మెంట్స్) మాదిరిగా అన్నమాట. నువ్వు ఎలాంటి స్థితిలో ఉన్నావు, నీవు పాటిస్తున్నది ఏమిటి అనేదే ఈ చెయ్యవలసిన పనుల లిస్టు. సద్గురువంటే ఎవరు? నువ్వు చేయవలసిన పనుల లిస్టును చూపే అద్దంలాంటివాడు. నీ దగ్గర ఉన్న లిస్టు నువ్వు చేయవలసిన పనులది అయినంతవరకు నువ్వు పురోగమిస్తావు. అలా కాకుండా వేరేవాళ్లు చెయ్యాల్సిన పనుల లిస్టును నువ్వు తీసుకుంటే నీలో ఎలాంటి పురోగతీ ఉండదు. ఎందుకంటే ఇతరుల లిస్టు నీ విషయంలో నిరర్ధకం.

**భక్తుడు :** మేము అటువంటి చెయ్యవలసిన పనుల లిస్టు తయారు చేసుకునేటపుడు నిజాయితీగా ఉండాలి కదా?

**గురువుగారు :** అవును, నిఖార్సయిన నిజాయితీ అవసరం. అంతా దానిమీదనే ఆధారపడి ఉంటుంది. అటువంటి నిజాయితీ ప్రాథమికమైన అవసరం.

**భక్తుడు :** అసలు "అద్దంలో చూడటం" అంటే ఏమిటి?

**గురువుగారు :** బాబా వైపుకు చూడటమే! బాబానే అద్దం. నువ్వు ఎంత అందంగా ఉన్నావో లేదా ఎంత వికారంగా ఉన్నావో నిజంగా నువ్వు తెలుసుకోవాలంటే, నువ్వు అద్దంలో చూసుకోవాలి. కానీ మనం అలా చూసుకోవడం లేదు. మీ అవసరాలేమిటి? నిన్ను బాబావైపుకు ఆకర్షించింది ఏమిటి? ఆ విషయాలను చూడటానికి ప్రయత్నించండి, వాటిమీద దృష్టిపెట్టి ఆ గుణాలు మీ హృదయంలో పెంపొందుతున్నాయో లేదో చూసుకోండి. అప్పుడు ఆదర్శాలకు, ఆచరణకు మధ్యన సామ్యత ఉంటుంది. మనం చెయ్యవలసిన పనుల లిస్టును మనం అనుసరిస్తున్నామా? అని చూసుకోవడమే మనం చేయవలసింది. కానీ మనకు ప్రక్కనవాళ్ల లిస్టు మీదే ఎక్కువ ఆసక్తి. సమస్యంతా అక్కడే వస్తుంది.

**భక్తుడు :** మేము చూసే విధానం మా పాత అలవాట్లను అనుసరించి ఉంటుంది కాబట్టి మేము ఎప్పుడూ వికృతమైన రూపాన్నే అద్దంలో చూస్తాము కదా!

**గురువుగారు :** అవును. కానీ ఎందుకలా జరుగుతుంది? ఎందుకంటే వికృతంగా ఉన్నది మనమే, అద్దం కాదు. కాబట్టి మిమ్మల్ని క్రమపద్ధతిలో ఉంచుకోవడానికి ప్రయత్నించండి: మిమ్మల్ని మీరు అందంగా మార్చుకోండి. దీనికోసమే మీకు అద్దం కావాలి. ఎవరికైనా అద్దం యొక్క అవసరమేమిటి? నువ్వు ఎలా ఉన్నావో ఆ నిజాన్ని నీకు చూపించడం కోసం మాత్రమే కాదు, మిమ్మల్ని మెరుగ్గా చెయ్యడానికి కూడా. మీరు వికారంగా ఉన్నారనుకోండి, అద్దం మీకు ఆ వికారాన్ని చూపిస్తుంది. మీరు వికారంగా ఉన్నారు కాబట్టి మిమ్మల్ని మీరు శుభ్రంగా, అందంగా, పొందికగా ఉండేట్టు చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అద్దం మిమ్మల్ని అందంగా తయారుచేయదు – మీకు మీరే ఆ పని చేసుకోవాలి. అద్దం మీకు దానిని చూపించడానికి మాత్రమే తోడ్పడుతుంది.



**భక్తుడు** : మాలో ఉండేటటువంటి దోషాన్ని మేము గుర్తించడం ఎలా?

**గురువుగారు :** ఆ దోషాన్ని పోగొట్టుకోవాలన్న కోరిక ఉంటే దానిని గుర్తించవచ్చు. నీలో ఉండే దోషమేమిటో నీకెలా తెలుస్తుంది? నువ్వు వాస్తవంలో సాంగత్యంలో ఉంటే నీలోని దోషమేమిటో తెలుస్తుంది. నువ్వు ఎంతగా వాస్తవంతో సాంగత్యంలో ఉంటావో అంతగా నీలో ఉన్న దోషమేమిటో నీకు తెలుస్తుంది, లేకపోతే నీకు తెలిసే అవకాశమే లేదు. సాయిబాబా వంటి సద్గురువులు నీలోని దోషాన్ని నీకు చూపించే అద్దం మాదిరిగా వ్యవహరిస్తారు. మనలోని ఆ దోషాన్ని దగ్గరగా చూసేకొద్దీ మనకు దాని గురించి నిజమైన ఎరుక కలిగేటటువంటి సమయం వస్తుంది. అప్పుడు ఆ దోషం లేకుండా పోతుంది, లేదా ఆ దోషం ఒక వాస్తవికమైన (మంచి) విషయంగా పరివర్తన చెందుతుంది. ఈ ప్రక్రియ దానంతట అదే జరుగుతుంది. నువ్వు అద్దం ముందు నుండి నడిచిపోతున్నావనుకో, జుట్టు కాస్త చెరిగినట్టు కనిపిస్తే, తక్షణం నీ చెయ్యి జుట్టును సరిచేస్తుంది, అలా జుట్టును సరిచేసుకుని నువ్వు వెళ్లిపోతావు.

అద్దం ఉన్నదున్నట్లు నిజాన్ని చూపినట్లు, సత్యాన్ని ప్రతిబింబించే మహాత్ముల సాంగత్యం మన వాస్తవరూపాన్ని మనకు చూపిస్తుంది. నేను చెప్పేదీ అదే – సత్ పదార్ధంతో సాంగత్యంలో ఉండటం, సత్సంగంలో ఉండటం. సత్సంగం నీలోని వాస్తవాన్ని నీకు నిరంతరం గుర్తుచేస్తూ ఉంటుంది, కనీసం నీలోని దోషాలను నీకు చూపుతూ ఉంటుంది. అలా కాకపోతే నీకు ఆ విషయం తెలిసే అవకాశమేలేదు. అందుకనే అంతా మళ్ళీ తిరిగి సత్సంగం అనే విషయం దగ్గరకే వస్తుంది. నువ్వు అయస్కాంతంగా మారాలంటే మరో అయస్కాంత సాంగత్యంలో ఉండటం తప్పనిసరి! ఇది వినా మరో దారిలేదు – నాన్యఃపంథా!

**గురువుగారు :** ఒక్క విషయం మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. మనమేమిటి, మన సామర్థ్యం ఎంత, మనం ఎంత సంసిద్ధులుగా ఉన్నాం అనే విషయాలను బాబా ప్రతిరోజూ, నిరంతరం వందలకొద్దీ సంఘటనల ద్వారా తెలియచేస్తూనే ఉన్నారు. ఇటువంటి విషయాల వద్ద బాబా దగ్గర పొరపాటు ఉండదు. కానీ మనమే వాటిని గుర్తించలేకపోతున్నాము, అవి మనకు కనబడటం లేదు, ఆ సంఘటనలను గురించి తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకోవడం కాదు, మనం వాటి గురించి అసలు ఆలోచించడానికి కూడా ప్రయత్నం చేయం. ఆయా సంఘటనలను కనీసం పరిగణనలోనికి కూడా తీసుకోము. మనం కేసును (ఆయా సంఘటనలను) విచారణకు కూడా ఒప్పుకోము.

**భక్తుడు** : ఇటువంటి సంఘటనలకు ఓ ఉదాహరణను ఇవ్వండి.

**గురువుగారు :** నేను ఉదాహరణలు ఇవ్వడం మొదలుపెడితే అవి వ్యక్తిగత విషయాలకు దారితీస్తాయి, అది నాకు ఇష్టం ఉండదు. అది ఎవరికి వారు చూసుకోవాలి. అవి కేవలం చాలా చిన్న విషయాలే కావచ్చు, పెద్ద విషయాలు కాకపోవచ్చు. నువ్వెవరో నువ్వు తెలుసుకోవడానికి పెద్దగా పరిశ్రమించవలసిన అవసరం లేదు. నువ్వు ఎవరో, ఎక్కడున్నావో బాబా నీకు అనుక్షణం చూపుతూనే ఉన్నారు. మనమే దానిని చూడటం లేదు. నువ్వేమిటో చూసుకో! బాబా నిరంతరం నువ్వెవరో అనే విషయాన్ని చూపుతూనే

ఉన్నారు. చూడండి! ఇక్కడి మార్గమిది. అద్దంలోకి చూడు, నీకు కనిపిస్తుంది! (గురువుగారు నవ్వుతూ...)



**భక్తుడు** : మరైతే మేము అద్దంలోకి చూడటానికి ఎందుకు నిరాకరిస్తున్నాం?

**గురువుగారు :** ఎందుకంటే అందులో కనిపించేది మనకు నచ్చదు. కాబట్టి మనల్ని మనకు చాలా అందంగా చూపించే సొంత అద్దం మన దగ్గర ఉంది. అందుకే మనల్ని మనం బాబా అనే నిజమైన అద్దంలోకి చూడాలనుకోవడం లేదు.

**గురువుగారు :** చాలామంది పరిపూర్ణ దర్పణంలాంటి పూండీస్వామిని దర్శించి, వారిలో తమను తాము చూసుకొని ఆనందంగా వెళ్లిపోయారు. అద్దంముందు ఏది నిలిచినా వాటివలన అద్దం యొక్క యోగ్యత ఏమీ మారదు. అద్దం ముందు ఒక నల్లని వస్తువు ఉందనుకోండి, అద్దం దానిని అంతే నల్లగా ప్రతిబింబించడం వల్ల అద్దం నల్లగా మారుతుందా? పరిపూర్ణ దర్పణం దాని ప్రభావానికి లోనుకాదు. అది ఎన్ని వస్తువులనైనా ప్రతిబింబించగలదు. ఆ అద్దానికి ఎటువంటి పరిమితులు ఉండవు.

**భక్తుడు** : కానీ మనకు ఆ అద్దంలోనికి చూడగల సామర్థ్యం ఉండాలిగదా? ఆయనను దర్శించిన వారందరికి ఆయన అద్దంలాంటి వారని తెలుసా?

**గురువుగారు :** మీరు ఆయనను అద్దంగా కూడా గుర్తించకపోతే, అప్పుడు సద్గురువు, శిష్యుడు అనే తలంపే లేదు. సమస్యంతా అద్దంతో మీ సంబంధం ఏమిటి అనే దానిగురించే కదా? అదే లేనపుడు అసలు సమస్యే లేదు. పోగొట్టుకోవడం అనేది ఏమీ లేదు, ఏదీ పొందటం అనేది కూడా లేదు.

**భక్తుడు** : మనం అద్దంలోకి చూసినపుడు అసలు ఏం మారుతుంది?

**గురువుగారు :** అద్దంలోకి ఊరికే చూస్తే ఏమీ మారిపోదు. ఏదైనా ఉండవలసిన దగ్గర ఉండకపోతే, ఉదాహరణకు, జుట్టు రేగిపోయి ఉంటే – మనం సరిదిద్దుకుంటాం, సరిచేసుకుంటాం. అది సరిదిద్దుకున్నపుడు అద్దంలో సరిగ్గా ఉన్నట్టు కనిపిస్తుంది. అద్దం ముందు ఊరికే నిలబడితే జుట్టు తానే సరిచేసుకుంటుందా? నువ్వు ఎలా ఉన్నావో అద్దంలో నీకు అలాగనే కనిపిస్తుంది.

**భక్తుడు** : గురువుగారూ! అద్దంలో మా పరిమితులే ప్రతిబింబిస్తాయి కదా, మార్పు అనేది మాకు మేము తెచ్చుకోవాలా?

**గురువుగారు :** అద్దం అనేది ఒక పరిమితమైన పోలిక మాత్రమే. ఏ పోలికా పరిపూర్ణమైనది కాదు. సద్గురువు అనే అద్దం విషయానికొస్తే ఆయన మనలో ఏ మార్పు రావాలో తెలియచేసి, ఆ మార్పు సాధించడానికి తోడ్పడుతూ మనం మార్పును సాధించడానికి కూడా ఆయన కారణభూతులౌతారు. ఆయన ఒక సజీవ దర్పణం. జడమైన దర్పణం కాదు. ఆ సజీవ దర్పణాన్ని ఊహించి చూస్తే అప్పుడు మీకు అర్థమవుతుంది. సద్గురువు మనలోని దోషాలను చూపడం మాత్రమే కాదు, వాటినన్నింటినీ తొలగిస్తారు కూడా.

**భక్తుడు** : సద్గురువు ఒక అద్భుతమైన మహిమగల దర్పణం!



**గురువుగారు :** అవును, మహిమగల దర్పణం.

**భక్తుడు** : మీరు గురువు ఒక సజీవ దర్పణం అని చెప్పారు, ఆయన ప్రతిబింబించేది ఏమిటి?

**గురువుగారు :** నీ అంతరాత్మను (నీ నిజమైన స్వరూపాన్ని) ఆయన ప్రతిబింబిస్తారు.

**భక్తుడు** : దానర్ధం ఏమిటి?

**గురువుగారు :** మామూలు అద్దం కేవలం నీ బాహ్యరూపాన్ని చూపిస్తుంది. కానీ సద్గురువనే ఒక సజీవ దర్పణం నీలో మార్పుతేవడానికి కూడా ప్రయత్నిస్తుంది. అందుకనే నేను దానిని సజీవ దర్పణం అంటాను. అది ఒక మామూలు జడమైన అద్దం కాదు. నువ్వు ఎలా ఉంటే అలా ఉన్నదున్నట్లు చూపించడానికి! మామూలు అద్దంలాగా సద్గురువనే సజీవ దర్పణం నువ్వు కురూపిగా వుంటే కురూపిగానే చూపించక, నీలోని వికారాన్ని, మాలిన్యాలను తొలగించి నిన్ను శుభ్రపరచడానికి ప్రయత్నిస్తుంది. ఒక మామూలు అద్దం ఈ పని చేయలేదు. కానీ సద్గురువనే ఒక సజీవ దర్పణం అలా చేయగలదు. ఈ అద్దం నువ్వెలా వుంటే అలా చూపించడమే కాక నిన్ను మెరుగుపరచడానికి కూడా ప్రయత్నిస్తుంది. సద్గురువు 'ఒక సజీవమైన అద్దం' అంటే నా ఉద్దేశ్యమిదే.

**భక్తుడు** : ఆ అద్దం అలా ఎందుకు చేస్తుంది? దాని వెనుకగల కారణం ఏమిటి?

**గురువుగారు :** దానికి కారణం అంటూ ఏమీ లేదు. అది ఆయన లీల, ఆయన క్రీడ. సద్గురువనే సచేతనమైన అద్దం నిన్ను సరిచేయడానికి, అందంగా తయారు చేయడానికి ప్రయత్నం చేస్తున్నపుడు, వాస్తవానికి జరిగేది ఏమిటంటే సద్గురువు తనను తానే సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే ఆయనకు నువ్వు వేరే వ్యక్తిగా కనిపించవు. ఆయనవైపు నుండి జరిగేది ఇదే. తనపట్ల తానే జాగ్రత్త వహిస్తూ, తనకు తానే సహాయం చేసుకునే ప్రయత్నమే జరుగుతుంది. సద్గురువుకు మీరందరూ తనలో భాగంగానే అనిపిస్తారు. కాబట్టి సద్గురువు వైపునుండి చూస్తే ఆయనకు ఆయనే సహాయం చేసుకుంటున్నాడు.

**భక్తుడు** : కాబట్టి వేరే ఛాయిస్ (అవకాశం) లేదు కదా?

**గురువుగారు :** అవును వేరే ఛాయిస్ లేదు. ఆయన మనల్ని తనలో భాగాలుగానే చూస్తాడు కాబట్టే ఆయన మనల్ని ప్రేమిస్తాడు. ఎవరైనా ఒక వ్యక్తి మహాత్ముని సన్నిధికి వచ్చినపుడు, ఆ మహాత్ముడు సదరు వ్యక్తితో తాదాత్మ్యం చెందుతారు. మహాత్ములు అటువంటి స్థితిలో ఉంటారు. వారి సన్నిధిలో ద్వైతభావం ఉండదు. ఆ మహాత్ముని అనుభవంలో తమ కోసమే తాము ప్రతిస్పందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నప్పుడు అది ఆయనకు స్వగతమైన సంభాషణలాగా, తమతోతామే మాట్లాడుకుంటున్నట్లుగా ఉంటుంది. అందుకే కొన్ని సందర్భాలలో కొన్ని ప్రశ్నలు అడగకపోయినా సమాధానాలు వస్తుంటాయి. మన మనస్సులోని ఆలోచనలు వారు బయటకు చెబుతారు. ఒక విధమైన దయతో కూడిన ప్రేమ కలుగుతుంది. ఇవన్నీ జరగడానికి కారణం ఆయనకు మనతో గల ఏకత్వం. ఆయన అద్దంలాగా, సచేతనమైన అద్దంలాగా పనిచేస్తారు.



**నేను బాబాను చూసినపుడల్లా ఆయన దృష్టి నాకెలా ఉంటుందంటే, అప్పుడే పుట్టిన బిడ్డను కన్నతల్లి ప్రప్రథమంగా ఎంత అపురూపంగా చూసుకుంటుందో అలా అనిపిస్తుంది. ఆ చూపు ఎలా ఉంటుందో చెప్పడానికి ఇంతకుమించి ఉపమానం లేదనిపిస్తుంది. ఊహించి చూడండి! అప్పటివరకు ఆ బిడ్డ తల్లి శరీరంలో ఒక భాగంగా ఆమెతో కలసి ఉంది. కానీ ఇపుడు అది తల్లి శరీరం నుండి విడివడి వేరొక ఉనికిని సంతరించుకుంది. ఆ బిడ్డకు తానువేరుగా అనిపిస్తుంది కానీ, తల్లికి కొంతకాలమైనా ఆ బిడ్డ తన శరీరమని, తనలోని అంతర్భాగమనే భావన ఉంటుంది. అందుకే నేను "తొలిసారి చూసుకున్నపుడు" అని చెప్పాను. బాబా చూపులో నాకు కనిపించేది అదే భావం. సద్గురువు సమస్త సృష్టిని తనలోని భాగంగానే ప్రేమిస్తాడు. ప్రాపంచికంగా తల్లి విషయంలో ఈ అనుభవం కొంతకాలమే ఉంటుంది. బిడ్డ పెరుగుతూ ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకునే కొద్దీ అది తనలో భాగమేనన్న భావన సన్నగిల్లుతుంది. కానీ సద్గురువుకు ఆ ప్రథమానుభూతి నిరంతరం ఉంటుంది. ఎప్పటికీ మారదు.**

## శాస్త్ర గోష్ఠి

ఎవరినో ఉద్ధరించడానికి నేర్చుకునేది, ఎవరికో భయపడి నేర్చుకునేది, నేర్పేది విద్య కాదు, కనుక మనని ఉద్ధరించదు. పిల్లవాణ్ణి స్కూలుకి పంపడం ప్రారంభించినపుడు ఎందుకు పంపాలి అనే ప్రశ్న తల్లిదండ్రులకి రావడం మానేసింది. పిల్లలకు చదువు చెప్పడం వల్ల వాళ్లకి కలిగే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్న ఉపాధ్యాయుడికి రావడం మానేసింది. తత్ఫలితంగా మనం చదువుకొనడం ఎందుకు? బడికి పోవడం ఎందుకు? అనే ప్రశ్నలు విద్యార్థికి రావడం మానేశాయి. ఇలా కొన్ని తరాలు జరిగింది, చదివించడం, చదువు చెప్పడం, చదువుకొనడం ఒక తప్పుని సరియైన మూఢ విశ్వాసంగా పరిణమించింది. "అలా చెయ్యాలి గనుక – అందరూ చేస్తున్నారు– ఇంతకు ముందు వాళ్లూ చేసారు గనుక" అనే సమాధానాలు పశుచిహ్నాలుగా మానవ మస్తిష్కంలో కొంత కాలం నిలబడినాయి.

"చదువుకుంటే ఉద్యోగం వస్తుంది. దానితో జీతం వస్తుంది. దానితో పొట్ట గడుస్తుంది. పెళ్లి చేసుకోవచ్చు. తల్లిదండ్రుల కన్నా వేరే వెళ్లిపోయి ఉండవచ్చు. పిల్లల్ని కనవచ్చు. కొంత బ్యాంక్‌లో వేసి, కొంత వెనకేసుకొని ఇల్లు కట్టుకోవచ్చు" అనే ఉపపత్తులు కొంతకాలం పరిపాలించాయి. దానితో ఇంకొకడు మనకి ఉద్యోగమిచ్చి పోషించవలసిన బ్రతుకు ఏర్పడింది. దానితో పెద్ద దేశాలు చిన్న దేశాలను దాస్యం చెలగాటంలో దింపి చూడటానికి సాధనంగా ప్రస్తుత విద్యావిధానాన్ని కనిపెట్టాయి. ఇంకొక దేశం వాడు మనల్ని పరిపాలిస్తే హాయిగా ఉద్యోగాలిస్తాడు. లేదా వాడి దేశంతో జరిగే వ్యాపారం మన ఊళ్లో పెడితే మనం కూడా అందులో పనిచేయవచ్చు– అనే పరమార్థం పరిణామం చెందింది.

వైద్య విజ్ఞానం, ఇంజనీరింగ్ శాఖలు, స్థలాలు, ఇళ్లు కొని అమ్మడం, పంట పొలాలు ఇళ్లస్థలాలుగా మార్చి లాభం తీయడం, ద్రవ్యశాస్త్ర శాఖలు జీవనోపాధికి తోడ్పడుతున్నాయి. కనుక వీటితో అందవలసిన విద్యను ఖరీదు పెంచి వాణిజ్య సరళిలోకి దింపడం ప్రస్తుత విద్యావిధాన పరిణామం. ఈ వాణిజ్యంలో విద్యావంతులు, విద్యావిహీనులు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి బాగా లాభాలు పొందవచ్చు. ఈ విధమైన ప్రయోజనాలతో పరిణామం చెందుతూ ఉన్న విద్యావిధానంలో పరమార్థం ఉండదని అందరికీ తెలుసు.



విద్యార్థి ఈ విధానం మీద విశ్వాసాన్ని కోల్పోవడం కూడా ఎప్పుడో జరిగింది. ప్రయోజనం లేదని తెలిసిన తరువాత విద్యార్థి కూడా వాణిజ్య సరళిలోకి దిగిపోయాడు.

"నాకు ఈ కోర్సులో సీటు కావాలి. ఫస్టుక్లాసు కావాలి, ఎంత పుచ్చుకుంటావో చెప్పు" అనే బేరానికి విద్యార్థి దిగడం కూడా జరిగింది. మతము, వర్గము, కులము, భవిష్యత్తును నిర్ణయించే పునాదులుగా విద్యావిధాన భవనం నూతనంగా నిర్మాణమవుతూ ఉన్నది. స్కూలు జీవితంలోనే విద్యార్థి తన కుటుంబ సభ్యుడుగా ఉండటం మానేస్తున్నాడు. కాలేజీ స్థాయిలోనే స్త్రీ పురుష సంబంధం స్వయంగా స్థిరపరచుకుంటున్నారు. ఉ ద్యోగంలో చేరగానే తల్లిదండ్రులు నిరాశ్రయులై ఇంట్లో మూడవ మనిషి లేకుండా ఒకరినొకరు చూచుకుంటూ బిక్కు బిక్కు మంటున్నారు. మరణానికి ఎదురుచూడటాన్ని మించి కార్యక్రమం ఏమీ మిగలడం లేదు. ఇంతవరకు అన్ని దేశాలలో నడిచిన నవీన విద్యావిధాన పరిణామం ఇది.

నిజమైన విద్య ఎలా ఉంటుంది. పది మంది వ్రాసినవి బట్టీ పట్టడమేనా? పరీక్షలంటే జ్ఞాపకశక్తికి పోటీలు లేక యుక్తిగానో, శౌర్యంతోనో కాపీలు కొట్టడానికి పోటీలు మాత్రమేనా? ఇంకేమన్నా పరమార్థం ఉన్నదా? తప్పకుండా ఉన్నది. అన్ని జాతులలోను మొన్న మొన్నటిదాకా ఉండేది. కావాలి అంటే ఇప్పుడూ ఉంటుంది. సుఖము, శాంతి, వికాసము కలిగించే జీవితాభ్యాసమే విద్యాభ్యాసము. దాని మొదటి సూత్రం ఏమంటే ఈ సుఖము, శాంతి, తృప్తి, వికాసము అనేవి లేనప్పుడు జీవితం వినియోగం లేని యంత్రం అవుతుంది. ఈ అంశాలు పుట్టి పెరిగేటట్లుగా జీవించే విద్యావిధానం! ఈ నాలుగు అంశాలు ఎదుటి వారికి ఇవ్వడం వల్ల పెరుగుతాయి. తాను వసూలు చేసుకొనడానికి యత్నించే కొలది నశిస్తాయి. ఇది విద్యావిధానంలో మొదటి సూత్రం."త్యాగేనైక అమృతత్వ మానశుః" **ఇక రెండవ సూత్రం** మానవ దేహ వ్యూహ యంత్రాంగం గూర్చిన శాస్త్రం, ఈ యంత్రాన్ని ఎలా వాడుకోవాలి? ఇంద్రియాలు, మనస్సు దేనికి? బాహ్య ప్రపంచానికి, లోపలి ప్రపంచానికి గల సంబంధమేమిటి? స్త్రీ పురుషులు, భార్యాభర్తలు, తల్లిదండ్రులు సంబంధాల యంత్రాంగమేమిటి? తల్లిదండ్రులు, బిడ్డలు, సోదరులు, ఇరుగుపొరుగువారు అనే సంబంధాల అల్లికపని ఎలా నేర్చుకోవాలి? ఆహార నిద్ర భయ మైధునాల ప్రయోజనం సద్వినియోగం అనే శాస్త్రం ఎలాంటిది? శారీరక మానసిక మాలిన్యాలు, వాటి క్షాళనం, చికిత్స అనేవాటి కథ కమామిషు ఏమిటి? వాటి ఎడల మన కర్తవ్యం ఏమిటి?

వీటికి సంబంధించిన శాస్త్రీయ విద్యావిధానం ఇవ్వగల విశ్వ విద్యాలయాలుగాని, ఆచార్యులుగాని, తల్లిదండ్రులుగాని మనకు లభించడం లేదు. ఎవరికి చేతనయినట్లు వారు ఈ దేహంతో ఎక్స్‌పరిమెంట్ చేసి కొంత నిజమైన విద్యను ఆర్జించుకునేసరికి వయస్సు మళ్లిపోవడం, దేహం కామ క్రోధాదుల చెత్త బండి క్రిందతయారవడం, రిపేరుకు అవకాశం లేకపోవడం జరుగుతుంది. సమన్వయ విద్య కావలసి ఉ న్నది. దానినే ప్రాచీనజాతులు యోగవిద్య, వేదవిద్య అన్నారు. దీనికి విద్యాలయం– కుటుంబం, ఆచార్యులు– తల్లిదండ్రులు, తాతలు. విద్యార్థులు– బిడ్డలు, మనుమలు. ధర్మం కోసం అర్థకామాలు నేర్పే విద్య కావాలి. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే పొరలలో నుండి మనిషి అనే వెలుగు బహిర్లోకంలోకి వెలిగేటట్లు మెలగాలంటే ఏమి చేయాలో దానికే శాస్త్రీయ విద్యావిధానం కావాలి. అది ఇప్పటి టెక్స్ట్ బుక్కులలో దొరకదు. అది చెప్పగల ప్రొఫెసర్లు, చెప్పించగల విశ్వవిద్యాలయాలు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభం అయ్యే సంస్కార పరిణామ దశ ఇంకా మానవుడికి కలుగలేదు.



కలిగించుకునేందుకు కావలసిన పాఠ్యపుస్తకాలే అనేక జాతుల పవిత్ర గ్రంథాలు. భగవద్గీత, వేదం, ఉప నిషత్తులు, బైబిలు మొదలైన గ్రంథాలలో మనకు ఇప్పుడు కావలసిన విద్య పుష్కలంగా శాస్త్రీయ విధానంలో ఇవ్వబడియున్నది. దానిని నిజమైన విద్యావిధానంగా అంగీకరించే సంస్కారం, ధైర్యం, సూటిదనం మనకి వచ్చిన రోజునుండి అవి ఉపకరిస్తాయి. **సత్ప్రవర్తనను ఎవడికి వాడు సృష్టించుకోగల సామర్థ్యమే నిజమైన విద్య.** దానికి కావలసిన శాస్త్రీయ విధానాలు ఎక్కడ ఉన్నా సంకోచం లేకుండా బాహాటంగా అమలులో పెట్టడం, నిదర్శనమే దర్శనానికి ప్రదర్శనగా పనిచేయడం కావాలి. చీకటి నుండి వెలుగులోకి, భ్రాంతి నుండి సత్యంలోకి, మృత్యువు నుండి అమృతత్వంలోకి నడిపించే విధానాన్ని సాధించి, నేర్చి ప్రణాళికగా రూపొందించాలి. (భారతీయ విద్యాకేంద్రం - విశాఖపట్నం వారి రజతోత్సవ ప్రత్యేక సంచికకు **కులపతి** ఇచ్చిన ప్రత్యేక వ్యాసం)

## "తమసోమా జ్యోతిర్గమయా"

**అజ్ఞానమనే చీకట్లను పోగొట్టే జ్ఞానమనే వెలుగు నింపే సమర్థుడు - సద్గురువు**

దైవం గురు రూపమున గోచరించు వరకు మానవునకు శాస్త్రమే ప్రమాణం. శాస్త్రం చెప్పినట్లు నడచుకొనుట, పాత్రతను సంతరించుకొనుట మానవుని కర్తవ్యం. (పరిపూర్ణమయిన దేవతారాధన గురువుని ప్రసాదిస్తుంది). గురువు గోచరించుట, అతడు మనతో సహచరించుట, అతని సహచర్యమున జీవితము పరిమళించుట. అదొక అనుగ్రహ విశేషం. ప్రతి మానవునికి జన్మల పరంపరలో జీవ ప్రయాణం సాగుచుండగా, ఎప్పుడో ఒకప్పుడు అనుభవంనకు వచ్చేటటువంటి అమృతఘట్టం!

సద్గురుని సహచర్యము లభించేవరకు లేదా అతడు గోచరించేవరకు మానవుడు ఎవరి ప్రకారం నడచుకోవాలి? దేని ప్రకారం నడచుకోవాలి? తనకు తోచినట్లు బ్రతికితే సరిపోతుందా? లేదా పరిస్థితులు తోచినట్లు బ్రతికితే సరిపోతుందా? ఎలా బ్రతకాలి? తన జీవితాన్ని ఎలా మలచుకోవాలి? ఏదోలా బ్రతికేస్తే ఎలా? విలువైన జీవితం వృథా అయిపోదూ! మరి ఏం చేయాలి? శాస్త్రం చెప్పినట్లు నడవాలి! వేదాల నుండి ధర్మ శాస్త్రాల వరకు చెప్పబడినదానిని ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని మలచుకుంటూ సాగాలి. మానవజాతి కొరకు ఋషులు ధర్మాన్ని అనేక విధాలుగా పొందుపరచిపెట్టారు. కానీ పుస్తకాలలోని మేలుబంతుల వంటివవి! వాటి ప్రకారం క్రింద మనం మన జీవితగాధను ఒద్దికగా వ్రాసుకుంటూ పోవాలి. వేదాలు వెలువడ్డాయి. వేదాలను అనుసరించి ధర్మశాస్త్రాలు రూపుదిద్దుకున్నాయి. ధర్మశాస్త్రాలు మానవునికి ధర్మాధర్మాలను గూర్చి వివరించి చెబుతున్నాయి. ఇలా జీవించు. ఇలా జీవించకు అని వివరిస్తున్నాయి. మనను సవరిస్తున్నాయి. వాటి ప్రకారం నడుచుకుంటూ ముందుకు సాగాలి మనం. వేద, ధర్మ శాస్త్రాలు ఒంటబట్టడానికి పురాణేతిహాసాలు వెలువడ్డాయి. వాటిని పారాయణం చేస్తూ ఉండాలి మనం. ఇలా జరుగుతూ ఉన్నప్పుడు మన జీవితం క్రమంగా సంస్కరింపబడుతుంది. ఆర్ష సంస్కృతి మనకు అలవడుతుంది. అన్ని విధాల దివ్య జీవనానికి తగిన పాత్రత మనకు సిద్ధిస్తుంది.

అయితే శాస్త్రాలలో కొన్ని కూడని అంశాలు మనకు కనబడుతూ ఉండవచ్చు. ఏమిటీ, శాస్త్రాలు ఇలా

చెబుతున్నాయి అని మనకు అనిపించవచ్చు. అవి మన మనస్సుకు ఇబ్బందిని కలిగిస్తూ ఉండవచ్చు. మిగతా శాస్త్రంలోని సూత్రాలకు, వీటికి పొంతన కుదరకపోవచ్చు. ఏం జరిగిందంటే మహర్షులు ధర్మ శాస్త్రాలు రచించారు. వారికి కావలసింది లోక శ్రేయస్సు మాత్రమే! వారికి లోకం దైవస్వరూపం. వేదస్వరూపం! వారి వాక్కు అమోఘం. అయితే కాలక్రమంలో పండితులనబడేవారు కొందరు తమ ఇష్టానిష్టాలను ధర్మ శాస్త్రాలలో అక్కడక్కడ చొప్పిస్తూ వచ్చారు. మనం చెప్పామంటే జనం వినరు. శాస్త్రాలు చెప్పాయంటే వింటారు. అని వాళ్ల భావన! కొంతమంది విదేశీయులు కూడా మన పండితులను చేరదీసి, వారిచేత ఇలా మరికొంత కలుషితం చేయడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నం ఇలా ఒక ప్రక్క నుండి సాగుతూనే ఉంటుంది. పనిగట్టుకొని బియ్యంలో రాళ్లను కలిపే వాళ్లందరూ! అలాంటివాళ్లే వీళ్లు కూడా! మీరు గమనించారో లేదో ఆ రాళ్లు కూడా బియ్యంలాగానే ఉంటాయి దూరానికి. వాటిని తయారు చేయడానికి ప్రత్యేకమయిన యంత్రాలుంటాయి. ఆ యంత్రాలకు యజమానులు, కార్మికులు కూడా ఉంటారు. వీరంతా పూనుకొని తెల్లని రాళ్లను బియ్యంలో కలగలుపు చేస్తారు. ఏమంటాము. ఇది ఒక లోక చిత్రం! అయితే మనమేం చేస్తాం. ఎలాగో ఒకలా ఆ రాళ్లను ఏరుకొని, బియ్యాన్ని వేరుచేసుకొని మన వంటకు వినియోగించుకుంటాం. ఇంకొక చిత్రమేమంటే ఈ బియ్యంలో కలుపబడే రాళ్లను ఒడుపుగా జల్లించేవాళ్లుంటారు. వాళ్లూ ఈ లోకంలోనే వస్తారు. ఇంతకూ వేరు చేసిపెట్టే వారిలాగానే కాలకాలాల్లో మహనీయులు పుట్టుకొస్తారు. ఏవి మహర్షుల వాక్యాలో, ఏవి పండితులనబడే వారి అభూత కల్పనలో మనకు విడమరిచి చెబుతారు. కాలం కావలసిన ఏర్పాట్లను ఎప్పుడూ చేసి పెడుతుంది. మనం కంగారు పడవలసిన పనిలేదు.

ఇలా శాస్త్రానుసారం ఆర్ష సంస్కృతిని అవలంబిస్తూ ముందుకు సాగుతూ ఉండగా, ఏదో ఒక క్షణాన గురుదేవుని దివ్యసాక్షాత్కారం మనకు లభిస్తుంది. భగవానుడు మనకొరకు గురుదేవుడై సాక్షాత్కరిస్తాడు. మానవరూపుడై మనతో సహచరిస్తాడు. సందేశమిస్తాడు. సల్లాపమాడతాడు. సరససరసంగానే మనని సంస్కరించి వేస్తాడు. ఆ సహచర్యంలో నవరసాలను అనుభవింపచేస్తాడు. నిత్యనూతన జీవితాన్ని అనుగ్రహిస్తాడు. ఇక ఆ నూతనత్వం శాశ్వతం. జన్మలు గడుస్తున్నా ఆ స్పర్శా, ఆ అనుభూతి, ఆ నిత్యనూతనత్వం కొనసాగుతూనే ఉంటాయి. సృష్టికథ అర్థమప్పుడు తెలుస్తుంది. పరమార్థమెప్పుడు బోధపడుతుంది. పరమానందం అప్పుడు అనుభవానికి వస్తుంది. ఆ అనుభూతి–అది ఆయన విభూతి!

క్రమంగా ఆయన అంతటా గోచరించడం మొదలు పెడతాడు. దినచర్యగా అడుగడుగునా గోచరిస్తాడు. క్రమంగా అన్నీ తానుగానే కనబడతాడు. జగత్తంతా తానేనన్న అనుభవం వస్తుంది. గురుదేవుడు జగత్తంతటా గోచరిస్తాడు. (చూపుతాకినచోట చొక్కముగనీవే – శ్రీబాబూజీ) జగద్గురువుగా సాక్షాత్కరిస్తాడు మన శరీరాన్ని రథంగా స్వీకరించి, తను సారథియై జీవితాన్ని ఒక ధర్మలీలా విశేషంగా నడిపిస్తాడు. ఆ సారథ్యం అనుభవైకవేద్యం. ఇక మన జీవితం, జీవనం ఆయనకు నైవేద్యం. – **పార్థసారథి ప్రవచనాలు**



సాయిభక్తుడు అని అంటే...?

బాబానే నాకు సర్వస్వం
బాబానే నాకు దైవము. సర్వం ఆయనేను
నేను ఏమి చేసినా నా మంచిచెడ్డలు అన్నీ కూడాను
ఆయన స్వాధీనంలో వున్నాయి. అనేటటువంటి
సంపూర్ణమైనటువంటి విశ్వాసం ఎవరికైతే ఉంటుందో
వాళ్లే బాబా భక్తులు. బాబాను నమ్ముకున్నవాడు,
ప్రతిదానికీ నమ్ముకున్న వాడు - బాబా మీద ఆధారపడ్డవాడు. **Dependent..**
పసిబిడ్డ , మానాలు మాత్రమే ఉండేటువంటి బిడ్డ - తల్లి మీద ఎట్లా
ఆధారపడుతుందో అట్లా ఆధారపడినటువంటివాడు....

సాయిభక్తుడు అంటే..

\- శ్రీ బాబూజీ